ఇసుక డంప్‌లు సీజ్



ఇసుక కొండలను పరిశీలిస్తున్న అధికారుల బృందం

ములకలచెరువు, జూలై 9: ములకలచెరువు మండలం సోంపల్లె పంచాయతీ రెడ్డివారిపల్లె సమీపంలో ఉన్న ఇసుక కొండలను మంగళవారం అధికారుల బృందం సీజ్ చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా ఇసుకను అక్రమంగా తరలించి కొండలుగా వేశారు. ప్రస్తుతం ఇక్కడ మూడు పెద్ద కొండలు, ఒక చిన్న కొండ ఇసుక ఉంది. పెద్దతిప్పసముద్రం మండలం టి.సదుం సమీపంలోని సంగమేశ్వరస్వామి ఆలయం సమీపంలోని పాపాఘ్ని నుంచి ఈ ఇసుకను ఇక్కడికి తరలించారు. 2022లో ఈ ఇసుకను మాజీ మంత్రి, ప్రస్తుత పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి చెందిన పీఎల్ఆర్ పేరున్న టిప్పర్లు రాత్రింబవళ్లు తరలించిన విషయం ఇక్కడి వారిని ఎవరిని అడిగినా చెబుతారు. ప్రతిరోజూ వందల సంఖ్యలో ఇసుకను టిప్పర్లతో ఇక్కడికి తరలించి కొండలుగా పోశారు.

కడప జిల్లాలోని గండికోట జలాలను ఈ ప్రాంతానికి తీసుకొచ్చేందుకు వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 జూలై 4వ తేదీ గాలేరు-నగిరి కాలువను తంబళ్లపల్లె నియోజకవర్గం పెద్దమండ్యం, తంబళ్లపల్లె, ములకలచెరువు మండలాల మీదుగా పెద్దతిప్పసముద్రం మండలం పులికల్లులోని హంద్రీ-నీవా కాలువకు అనుసంధానం చేసేందుకు నిధులు విడుదల కావడంతో పనులు ప్రారంభించారు. ఈ పనులను అప్పట్లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంత్రి హోదాలో ములకలచెరువు మండలంలోని అడివినాయనిచెరువుపల్లె వద్ద పనులు ప్రారంభించారు. ఈ పనులను హైదరాబాదుకు చెందిన ఓ ప్రముఖ కంపెనీ దక్కించుకున్నట్లు తెలిసింది. అయితే ఇక్కడ మాత్రం పీఎల్ఆర్ కంపెనీనే పనులు చేపట్టినట్లు బహిరంగ చర్చే జరిగింది. ఎందుకంటే పీఎల్ఆర్ కంపెనీకి చెందిన వాహనాలు, యంత్రాలు పనులు చేపట్టాయి. ఈ క్రమంలో ఈ పనులకు ఇసుక అవసరమని పీఎల్ఆర్ పేరుతో ఉన్న టిప్పర్లు భారీగా ఇసుకను పెద్దతిప్పసముద్రం మండలం టి.సదుం సమీపంలోని పాపాఘ్ని నుంచి ములకలచెరువు మండలం రెడ్డివారిపల్లె సమీపంలోకి తోలి నిల్వ ఉంచారు. వేలాది లోడ్ల ఇసుకను ఇక్కడ కొండలుగా నిల్వ ఉంచారు. ఈ ఇసుక మాత్రం పనులకు ఎక్కడా ఉపయోగించలేదని పలువురు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

కలెక్టర్ ఆదేశాలతో ఇసుక కొండలు పరిశీలన

కలెక్టర్‌గా శ్రీధర్ చామకూరి బాధ్యతలు చేపట్టిన మూడు రోజులు కూడా కాక మునుపే జిల్లాలో జరిగిన అక్రమాలపై కొరడా ఝళిపిస్తున్నారు. ఇందులో భాగంగా రెడ్డివారిపల్లె సమీపంలోని అక్రమ ఇసుక కొండలపై విచారణకు ఆదేశించారు. దీంతో తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎస్ఈబీ సీఐ రామ్మోహన్, ఇరిగేషన్ డీఈ సారథి, మదనపల్లె గనులు, భూగర్భశాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సుప్రజ, సర్వేయర్ దుర్గాదేవి, స్థానిక ఆర్ఐ వీరాంజనేయులు, రెవెన్యూ సిబ్బంది చంద్రశేఖర్, రజిత తదితరులు ఇసుక కొండలను పరిశీలించారు. మొత్తం 27,472 క్యూబిక్ మీటర్ల ఇసుక ఉన్నట్లు అంచనా వేశారు. అనుసంధానం పనులు చేపట్టిన హైదరాబాదుకు చెందిన కంపెనీని సంప్రదించి ఇసుక నిల్వలపై సంబంధించిన రికార్డులు అడిగారు. ఎలాంటి రికార్డులు అందించకపోవడతో సీజ్ చేశారు. ఇసుక వ్యవహారంపై కలెక్టర్‌కు పూర్తిస్థాయి నివేదిక ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎన్నికల సమయంలో ఒక కొండ అక్రమంగా తరలింపు...?

సార్వత్రిక ఎన్నికల సమయంలో రెడ్డివారిపల్లె సమీపంలో ఉన్న ఒక ఇసుక కొండను అక్రమంగా తరలించారన్న ఆరోపణలు ఉన్నాయి. పీఎల్ఆర్ కంపెనీకి చెందిన టిప్పర్లు బయటి ప్రాంతాలకు వందలాది లోడ్ల ఇసుకను తరలించినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. రాత్రింబవళ్లు ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం.

సూపర్‌వైజర్, సిబ్బందికి షోకాజ్ నోటీసులు

- అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్



రిజిస్టర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

రాజంపేట, జూలై 9: విధుల్లో నిర్లక్ష్యం వహించిన అంగన్వాడీ సూపర్‌వైజర్, సిబ్బందికి కలెక్టర్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నూతన కలెక్టర్ శ్రీధర్ చామకూరి రాజంపేట మండలంలోని అంగన్వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కేంద్రంలో 13 మంది పిల్లలు హాజరు రిజిస్టర్‌లో ఉండగా అందులో ముగ్గురు పిల్లలు మాత్రమే రావడం పట్ల కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం 12 గంటలు అవుతున్నా పిల్లలకు భోజనాన్ని తయారు చేయకపోవడం, రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్ అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో నిర్లక్ష్యం వహించిన సూపర్‌వైజర్, సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. త్వరలో తిరిగి ఇదే కేంద్రానికి వస్తానని పూర్తి స్థాయిలో అంగన్వాడీ కేంద్రాన్ని నిర్వహించాలని ఆదేశించారు. ఆర్డీవో, తహసీల్దార్ తరచూ అంగన్వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో మోహన్‌రావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

- మైలేజీ కోసం వైసీపీ తాపత్రయం
- గత ప్రభుత్వ తప్పిదాలు కప్పిపుచ్చేందుకు తంటాలు
- టీడీపీపై నిందలు
- తిప్పికొట్టిన టీడీపీ
- ప్రజాసంక్షేమం కోసం పాటుపడాలని మంత్రి పిలుపు
- ప్రశాంతంగా జడ్పీ సర్వసభ్య సమావేశం

ప్రజాసమస్యలపై గరంగరం





సమావేశానికి హాజరైన సభ్యులు, మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, వేదికపై కలెక్టర్ శివశంకర్, అన్నమయ్య జిల్లా జేసీ ఫర్మాన్ అహ్మద్ తదితరులు

కడప(రూరల్), జూలై 9 : జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మంగళవారం ప్రజాసమస్యలపై గరంగరంగా కొనసాగింది. ఉదయం 10 గంటలకు ప్రారంభం కావాల్సిన సమావేశం 11.20 నిమిషాలకు ప్రారంభమైంది. రాష్ట్ర రావాణాశాఖ మంత్రితో పాటు టీడీపీ, వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీ హాజరయ్యారు. తాజాగా అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి నేతలే ప్రతిపక్ష హోదాను కొనసాగించి ప్రజాపక్షాన నిలబడ్డారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్ యాదవ్, ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి తదితరులు ప్రజా సమస్యలను వాడీవేడిగా సభకు వినిపించి అధికారుల నుంచి సమాధానాలను రాబట్టారు. వైసీపీ ప్రజాప్రతినిధులు గత ప్రభుత్వ తప్పిదాలను కప్పిపుచ్చేందుకు తంటాలు పడ్డారు. టీడీపీపై నిందలు వేయడానికి పోటీపడ్డారు.

ప్రోటోకాల్ మీరు పాటించారా..?

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ.. తనకు తెలియకుండానే టీడీపీ నేత బాలసుబ్రమణ్యం అధికారులతో సమావేశం నిర్వహించడం ఏంటని, ఏ హోదాలో నిర్వహించారని ప్రశ్నించారు. దీనిపై టీడీపీ ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఎదురుదాడికి దిగారు. మీ వరకు వచ్చేసరికి బాధ కలిగిందా.. మీ వైసీపీ పాలనలో పులివెందులలో ఇలాంటి అవమానాలను ఎన్నో భరించామన్నారు. ఏనాడైనా ప్రోటాకాల్ పాటించారా అప్పుడు గుర్తుకు రాని విషయాలు మీరు ప్రతిపక్షంలో ఉంటే గుర్తుకు వస్తాయా అని ఘాటుగా ప్రశ్నించారు.

కక్షసాధింపులు మాకు తెలియవు

చక్రాయపేట జడ్పీటీసీ తమ మండలంలో కాలేటి వాగు ప్రాజెక్టును నిర్మిస్తున్నారని కక్షసాధింపు చర్యలకు పోకుండా టీడీపీ ప్రభుత్వం పనులను పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ విషయంపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కక్షసాధింపులు తమ ప్రభుత్వానికి తెలియవని అలాంటి పనులు మీరు చేసినా తాము చేయమన్నారు. ప్రాజెక్టు పనులను ఏదో కంపెనీ చేస్తోందని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు జరగకపోతే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. వీఎన్‌పల్లె ఎంపీపీ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఎస్.పాలగిరిలో కొండవాగుపై కాంట్రాక్టరు బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారని ఇందుకు సంబంధించిన బిల్లులు గత వైసీపీ ప్రభుత్వంలో కాలేదని ఇప్పుడైనా మంజూరు చేయించాలని కోరారు. దీనిపై కమలాపురం ఎమ్మెల్యే మాట్లాడుతూ నిబంధనల ప్రకారం పనులు చేసి ఉంటే తప్పకుండా బిల్లులు వస్తాయన్నారు.

మీ పాలనలో 90 శాతం దౌర్జన్యాలు

వైసీపీ జడ్పీటీసీ శివప్రసాదర్‌రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం తప్పు చేయడం వలనే ప్రజలు తమ పార్టీని ఓడించి మీకు అధికారాన్ని అప్పగిస్తే మీరు నెల రోజుల పాలనలోనే భయభ్రాంతులకు లోనుచేస్తున్నారని అన్నారు. ఈ విషయంపై మంత్రి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ మీ పాలనలో 90 శాతం దౌర్జన్యాలు చేశారన్నారు. 2014-19లో టీడీపీ ప్రభుత్వంలో ఉన్న డీలర్‌షిప్‌లను, విద్యావలంటీర్లను, మధ్యాహ్నా భోజన పథకం ఏజెన్సీ నిర్వాహకులను, గ్రీన్ అంబాసిడర్లను ఇతర ప్రభుత్వశాఖలలో ఉన్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించి వైసీపీ కార్యకర్తలకు ఇచ్చుకున్నారని ఇలాంటి పనులు తమవల్ల కావన్నారు. తమ పాలనలో ఎక్కడో కింది స్థాయిలో ఒకటి అర జరిగినట్లు తమకు తెలిస్తే అలాంటి వాటికి తావు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

వైసీపీ అధికారం చేపట్టాక.. డిసెంబరులో అమ్మఒడి

సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై 40 రోజులు కావస్తున్నా ఇంతవరకు తల్లికివందనం కింద టీడీపీ ప్రభుత్వం డబ్బు ఇవ్వలేదని విమర్శించారు. ఈ అంశంపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ 2019 జూలైలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత అమ్మఒడిని ఎప్పుడు ఇచ్చారని డీఈవోను ప్రశ్నించగా అదే ఏడాది డిసెంబర్‌లో ఇచ్చారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వైసీపీ నేతలు గుర్తుపెట్టుకుని మాట్లాడితే బాగుంటుందని జడ్పీటీసీకి చురకలు అంటించారు. సమావేశంలో జడ్పీ శాఖ తప్ప అన్నిశాఖలపై చర్చిస్తున్నారని జడ్పీ శాఖలోని నిధుల ఖర్చుపై కూడా చర్చించాలన్నారు.

గత ప్రభుత్వంలో నాశిరకం మినుములు

గత వైసీపీ ప్రభుత్వంలో 2023 రబీలో నాశిరకం మినుములు, శనగలను సరఫరా చేశారని అదే పార్టీకి చెందిన వీఎన్‌పల్లె ఎంపీపీ ఆరోపించారు. టీడీపీ ప్రభుత్వమైనా మంచివి ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ప్రధానమంత్రి పసల్ బీమా పథకంలో రైతులకు అన్యాయం జరిగిందన్నారు. గత ప్రభుత్వం సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌ను ఎత్తివేసిందని దానిని తిరిగి కొనసాగించాలన్నారు. కమలాపురం ఎమ్మెల్యే మాట్లాడుతూ కమలాపురంలో 2019కి ముందు రిజిస్ట్రేషన్ అయిన భూములకు మాత్రమే పీఎం కిసాన్ అందుతోందని ఆ తరువాత భూములకు కూడా అందించాలన్నారు. చక్రాయపేట జడ్పీటీసీ మాట్లాడుతూ మండలంలో వరినాట్లు జరుగుతున్నాయని ఎరువులను అందుబాటులో ఉంచాలన్నారు. రైతు భరోసా కోసం రైతులు ఎదురుచూస్తున్నారన్నారు. మంత్రి మాట్లాడుతూ తమది రైతుల పక్షపాత ప్రభుత్వమన్నారు. రైతులను అన్ని విధాలా అదుకుంటామన్నారు.

అక్రమ పింఛన్లపై ఎమ్మెల్యే సుధాకర్‌యాదవ్ ఫైర్

గత వైసీపీ పాలనలో అక్రమ పింఛన్లు కోకొల్లలుగా ఇచ్చారని మైదుకూరు ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ ఫైర్ అయ్యారు. ప్రధానంగా వికలాంగుల పింఛన్లు అక్రమంగా ఉన్నాయన్నారు. చెవుడుకు అడ్డదారుల్లో సర్టిఫికెట్లు ఇస్తున్నారని వీటి సహాయంతో పింఛన్లు పొందుతున్నారన్నారు. ఫిజికల్ హ్యాండిక్యాప్డ్ సర్టిఫికెట్లపై విచారణ జరిపించాలని అలాగే అధికారులపై విచాణ చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తేవాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రె డ్డి పేర్కొన్నారు. ఉచిత ఇసుకపాలసీపై అవగాహన కల్పించారు. గత వైసీపీ పాలనలో గ్రావెల్, ఇసుక అక్రమంగా తరలిపోయిందని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ చర్చలో పలువురు జడ్పీటీసీలు మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి బోరుబావులకు విద్యుత్ సరఫరా ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. మంత్రి మాట్లాడుతూ గత 5 సంవత్సరాల నుంచి రైతుల బోరుబావులకు కూడా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటుచేయని కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. విద్య, వైద్యం, ఉపాధి, పశుసంవర్ధక శాఖల చర్చలో జడ్పీ వైస్ చైర్మన్-2 బాలయ్య, పోరుమామిళ్ల, బి.కోడూరు, సిద్దవటం, కమలాపురం, బద్వేలు జడ్పీటీసీలు, చెన్నూరు, బి.మఠం ఎంపీపీలు మాట్లాడారు. కలెక్టర్ లోతేటి శివశంకర్ మాట్లాడుతూ జడ్పీ సర్వసభ్య సమావేశంలో సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు తదుపరి జరిగే సమావేశంలో సమాధానాలతో అధికారులు రావాలన్నారు. జిల్లా అభివృద్ధికి అందరం కలిసి పాటుపడాలన్నారు.

ప్రజాప్రతినిధులకు సన్మానం

సమావేశం ప్రారంభం కాగానే మంత్రి రాంప్రసాద్ రెడ్డితో పాటు ఇటీవల ఎన్నికైన ఎంపీ, ఎమ్మెల్యేలను, ఎమ్మెల్సీలను జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా సత్కరించింది. అనంతరం కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన లోతేటి శివశంకర్‌ను మంత్రి సత్కరించారు.

ప్రేక్షక పాత్ర వహించిన చైర్‌పర్సన్

జడ్పీ ఇన్‌చార్జ్ చైర్‌పర్సన్ జె.శారద సమావేశానికి అధ్యక్షత వహించారే కానీ ఆద్యంతం ఆమె ఒక్క మాట కూడా మాట్లాడకుండా ప్రేక్షక పాత్ర పోషించడం పలువురిని విస్మయానికి గురిచేసింది. ఈ కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేశ్‌యాద్, కడప, అన్నమయ్య జిల్లాల జాయింట్ కలెక్టర్లు గణేశ్‌కుమార్, ఫర్మాన్ అహ్మద్, జడ్పీ సీఈవో సుధాకర్‌రెడ్డి, ఆయాశాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకోసం కట్టుబానిసలం

- ప్రజాసంక్షేమమే మా అజెండా
- హింస, దౌర్జన్యాలను దరిదాపుల్లోకి కూడా రానివ్వం
- తప్పుచేసిన వారిని తప్పకుండా చట్టం శిక్షిస్తుంది
- రాష్ట్ర రవాణాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

కడప(రూరల్), జూన్ 9: ఏపీలోని 175 అసెంబ్లీ స్థానాలలో 164 స్థానాలను కూటమికి కట్టబెట్టి దేశంలో ఎవరికీ దక్కని గౌరవాన్ని ప్రజలు తమకు ఇచ్చారని.. ఇలాంటి ప్రజలకోసం కట్టుబానిసల లాగా పనిచేసి వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జడ్పీ సమావేశ హాలులో నిర్వహించిన జడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాసంక్షేమమే తమ అజెండా అన్నారు. ఎల్లప్పుడు ప్రజలతోనే మమేకమై ఉంటామన్నారు. హింస, దౌర్జన్యాలను, తప్పుడు విధానాలను దరిదాపుల్లోకి కూడా రానీయమన్నారు. ఏవిధమైన దుశ్చర్యలకు పాల్పడమన్నారు. గత ప్రభుత్వ పాలనలో తప్పుచేసిన వారిని చట్టం తప్పకుండా శిక్షిస్తుందన్నారు. స్మగర్లు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఉపే క్షించబోమన్నారు. కూటమి ప్రభుత్వం 30 రోజుల పాలనలోనే ప్రజలు సంతోషంగా ఉండడానికి వీలైన అన్నిరకాల చర్యలను చేపడుతోందన్నారు. గత వైసీపీ పాలనలో ఎన్నడూ లేని రీతిలో జడ్పీ సర్వసభ్య సమావేశాన్ని ప్రజాపక్షాన కొనసాగించామన్నారు. జడ్పీ పాలకమండలికి పూర్తి ప్రాధాన్యత ఇచ్చామన్నారు. రాద్ధాంతాలకు తావులేకుండా ఉమ్మడి కడప జిల్లాలో రాబోయే కాలంలో ప్రజల అభివృద్ధికి ఏవిధమైన చర్యలు తీసుకోవాలి అనేదానిపై చర్చించామన్నారు. టీడీపీ ప్రభుత్వం ప్రజాపక్షపాతంగా ఉంటుందన్నారు. రెండు జిల్లాల్లో రాబోయే కాలంలో ప్రజలకు ఏఏ అవసరాలున్నాయో వాటిని గుర్తించి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కడప, అన్నమయ్య జిల్లాలకు కలెక్టర్లను, జేసీలను యువకులను వేశారన్నారు. చురుగ్గా అభివృద్ధి చేయాలన్నదే సీఎం ఉద్దేశ్యమన్నారు.

ప్రాధాన్యత క్రమంలో అమలు


తాము ఏమైతే చెప్పామో వాటిని ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ముందుకు వెళ్తున్నామన్నారు. జూలై 1న 65 లక్షల మందికి పింఛన్లు అందించామన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా 16వేల ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామన్నారు. ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చామన్నారు. పక్క రాష్ట్రాలకు, పక్క ప్రాంతాలకు ఒక్క పిడికెడు కూడా ఇసుక తరలిపోకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్మగ్లర్లను, యాంటీ సోషల్ ఎలిమెంట్స్‌ను ప్రోత్సహించమన్నారు. 70 శాతం మంది వ్యవసాయ రంగంపై అధారపడి జీవిస్తున్నారని, ప్రభుత్వం ఏర్పడిన 3 రోజుల్లోనే సీఎం పోలవరాన్ని సందర్శించారని అన్నారు. అనతి కాలంలోనే పోలవరాన్ని పూర్తిచేసి రైతులకు స్వర్ణయుగం తీసుకొస్తామన్నారు. ఎవరైతే ప్రజలకు మంచిచేస్తారో వారికే మళ్లీ ప్రజలు పట్టం కడతారన్నారు. స్థానిక సంస్థలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. తిరిగి వాటికి పూర్వవైభవాన్ని తీసుకొస్తామన్నారు.

గోవింద యని పలుకరే..

- భక్తుల కోర్కెలు తీర్చే దేవుడు.. సౌమ్యనాథుడు
- 13 నుంచి 23 వరకు బ్రహ్మోత్సవాలు
- 20న శ్రీదేవి భూదేవి సమేత స్వామివారి కల్యాణం

నందలూరు, జూలై 9: ఉమ్మడి కడప జిల్లాలో అత్యంత ప్రాశస్త్యం పొందిన సౌమ్యనాథస్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి 23వ తేదీ వరకు టీటీడీ ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరగనున్నాయి. నందలూరు మండలం బాహుదా నది తీరాన నారదమునిచే సౌమ్యనాథస్వామి ఆలయంలోని విగ్రహం ప్రతిష్ఠించబడినట్లు చరిత్ర ద్వారా తెలుస్తోంది. ఈ ఆలయం చోళుల శిల్పకళా నైపుణ్యానికి ప్రతీక. మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో ఈ ఆలయం ఉంది. దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో ఆలయం విస్తరించబడి ఉంది. ఈ ఆలయంలో 108 స్తంభాలు ఉన్నాయి. చోళరాజులు 11వ శతాబ్దం పూర్వార్థంలో ఆలయం నిర్మించి సౌమ్యనాథస్వామికి 120 ఎకరాల మాన్యం ఇచ్చినట్లు శాసనాల్లో లిఖించబడి ఉంది. చోళ, పాండ్యరాజులు 17వ శతాబ్దం వరకు ఆలయ నిర్మాణం చేపట్టినట్లు చరిత్ర చెబుతోంది. 12వ శతాబ్దంలో కాకతీయ ప్రతాపరుద్రుడు ఆలయానికి గాలిగోపురం కట్టించారు. నందలూరు, ఆడపూరు, మందరం, మన్నూరు, హస్తవరం గ్రామాలను దానంగా ఇచ్చినట్లు శాసనాలు చెబుతున్నాయి. సౌమ్యనాథస్వామి మూలవిరాట్‌ను గమనిస్తే తిరుమలలో ఉన్న శ్రీనివాసుడు కటి హస్తంతో తన పాదాలను శరణు కోరండి పునీతులు కండి అని ప్రబోధిస్తుంటే నందలూరులోని సౌమ్యనాథుడు తనను నమ్మి శరణు వేడితే కోరిన కోర్కెలు తీరుస్తానంటూ అభయహస్తంతో దర్శనమిస్తాడు. కాగా నిరంత్ర అనే మహారాజు పూర్వం నిరంతపురం గ్రామాన్ని నిర్మించగా ఆ గ్రామం బాహుదా నది వెల్లువలో కొట్టుకుపోగా తర్వాత నలంద అనే రాజు ఈ స్థలాన్ని సందర్శించి నందలూరు పేరుతో గ్రామాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది.





పద కవితా పితామహుడు అన్నమాచార్యులు వేంకటేశ్వరునిపై పలు శృంగార కీర్తనలు ఈ ఆలయంలో కూర్చొని రచించినట్లు ఆధారాలున్నాయి. సౌమ్యనాథుని గర్భగుడిలో ఎలాంటి దీపం లేకపోయినా మూలవిరాట్ ఉదయం నుంచి సాయంత్రం వరకు దేదీప్యమానంగా వెలుగొందేవిధంగా ఆలయాన్ని నిర్మించడం ఒక అద్భుతం. ఆలయ నిర్మాణంలో అప్పటి శిల్పకళా నైపుణ్యం, నిర్మాణంలో వారి కళకు అద్దం పడుతుందని చెప్పవచ్చు. గర్భగుడి ప్రథమ ద్వారం నుంచి గర్భాలయంలోని మూలవిరాట్‌కు దాదాపు వంద గజాల దూరం ఉంటుంది. ప్రథమ ద్వారం నుంచి చూస్తే స్వామివారు దేదీప్యమానంగా వెలుగుతూ దర్శనమిస్తారు. ఆలయ శాసనాలను గమనిస్తే సూర్యచంద్రుల చిహ్నాలు కనిపిస్తాయి. ఆలయ కుడ్యాల పైభాగాన చేప ఆకారం కనిపిస్తుంది. బాహుదానది వరదల వల్ల ఆలయంలో ఉన్న ఆ చేప ఆకారాన్ని వరదనీరు తాకితే ప్రాణంతో నీటిలో కలిసిపోతుందని భక్తుల నమ్మకం. ఆలయ గర్భగుడి ముందు ఉన్న కల్యాణమండపం కొంచెం విలక్షణంగా కనిపిస్తుంది. ఈ మంటపానికి కింది భాగాన సింహం తలలు ఉన్నాయి. సాధారణంగా ఏ ఆలయానికైనా సింహాల తలలు ఆలయం పైభాగంలో ఉంటాయి. కానీ ఇక్కడ మాత్రం మంటపానికి కింద భాగంలో ఉండడం వల్ల ఈ ఆలయానికి కింది భాగంలో మరో ఆలయం ఉంటుందని చరిత్రకారుల నమ్మకం. ఆలయం లోపల విశాలమైన యాగశాల, యోగ నరసింహస్వామి, గణపతి, ఆంజనేయస్వామిలకు చెందిన చిన్న చిన్న ఆలయాలు ఉన్నాయి. దేవాలయ ప్రాంగణంలో ఒక పెద్ద కోనేరు ఉంది. స్వామి వారికి బ్రహ్మోత్సవాలు జరిగినప్పుడు ఇక్కడ శ్రీవారి తెప్పోత్సవం నిర్వహించడానికి అనువుగా కోనేరు నిర్మించారు. స్వామి వారిని దర్శించుకుని కోర్కెలను కోరుకుని నిశ్చల భక్తితో గర్భాలయం చుట్టూ తొమ్మిది ప్రదక్షిణలు చేస్తే వారి కోరికలు నెరవేరుతాయని, వారి కోరిక నెరవేరగానే స్వామివారిని దర్శించుకుని గర్భాలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేయడం ఇక్కడి భక్తుల విశ్వాసం. ఇలా ప్రతిరోజూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వారి కోరికలు తీరగానే ఆలయ గర్భాలయం చుట్టూ 108 ప్రదక్షిణలు చేసే భక్తులతో నిండిపోతుంది. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధీనంలో ఉన్న సౌమ్యనాథ ఆలయంలో ప్రతి సంవత్సరం ఆషాడమాసంలో వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తుంటారు.




13 నుంచి బ్రహ్మోత్సవాలు

జిల్లాలో అత్యంత ప్రాశస్త్యం పొందిన ఆలయాల్లో ఒకటైన సౌమ్యనాథస్వామి ఆలయంలో ఈనెల 13 నుంచి 23వ తేదీ వరకు 11 రోజుల పాటు అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. 13వ తేదీ ఉదయం తిరుమంజనం, రాత్రి అంకురార్పణ, 14న ఉదయం ధ్వజారోహణం, రాత్రి యాలి వాహనం, 15న ఉదయం పల్లకిసేవ, రాత్రి హంస వాహనం, 16న ఉదయం పల్లకిసేవ, రాత్రి సింహ వాహనం ఉంటాయి. 17న ఉదయం పల్లకిసేవ, రాత్రి హనుమంత వాహనం, 18న ఉదయం శేష వాహనం, రాత్రి గరుడ వాహనం, 19న ఉదయం సూర్యప్రభ, రాత్రి చంద్రప్రభ వాహనం, 20న ఉదయం కల్యాణోత్సవం, రాత్రి గజవాహనం, 21న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 22న ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజారోహణం, 23న పుష్పయాగంతో బ్రహ్మోత్సవాలు పూర్తవుతాయి.

వాగులు, వంకలను కలిపేసి.. లేఅవుట్లు



రంపతాడు గ్రామ పరిధిలో కాలిబాటను కలిపేసుకొని నిర్మించిన కాంపౌండ్ వాల్, ప్రహరీ పక్కన ఏర్పాటు చేసిన కాలిబాట, కాల్వను ఆక్రమించి నిర్మించిన ప్రహరీ గోడ, వెల్లటూరులో అనుమతులు లేకుండా వేసిన వెంచర్

- పుట్టగొడుగుల్లా వెలుస్తున్న వెంచర్లు
- ప్లాట్లుకొనుగోలు చేస్తున్న అమాయక జనం
- అనుమతులు, ల్యాండ్ కన్వర్షన్ అసలే ఉండవు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

పెండ్లిమర్రి, జూలై 9: రోజురోజుకు కడప నగరం నలుదిశలా విస్తరిస్తోంది. దీనికి తోడు కడప నుంచి పులివెందులకు వెళ్లే ప్రధానరహదారి వెంబడి రియల్ వెంచర్లు ఇబ్బడి ముబ్బడిగా వేశారు. ఈ రహదారిలోనే యోగి వేమన యూనివర్సిటీ, ఇంజనీరింగ్ కాలేజీలు, కొప్పర్తి పారిశ్రామికవాడ ఉండడంతో ఇక్కడి భూములకు రెక్కలు వచ్చాయి. ఇదే అదునుగా భావించి రియల్టర్లు పెండ్లిమర్రి మండలం పరిధిలో వెంచర్లు వేశారు. ఇక్కడ సెంటు లక్ష నుంచి పది లక్షల రూపాయల వరకు ధరపలుకుతోంది. దీంతో రియల్టర్లకు ఈ ప్రాంతం స్వర్గధామంగా మారింది. యూనివర్సిటీ చుట్టూ డీకేటీ భూములు ఉండడంతో గుట్టుచప్పుడు కాకుండా రెవెన్యూ సిబ్బంది సహకారంతో వాటిని కొట్టేసి వెంచర్లు వేసి కోట్లు దండుకుంటున్నారు. నిన్నటిదాకా పచ్చని పంట పొలాలతో కలకలలాడిన భూములు ఇప్పుడు వెంచర్లుగా మారి సరిహద్దులు రంగురాళ్లతో దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండానే ఇష్టారాజ్యంగా లేఅవుట్లు వేస్తున్న అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదు.

లేఅవుట్ వేయాలంటే....

గ్రామ పంచాయతీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. నిబంధనల ప్రకారం లేఅవుట్లలో రోడ్లు, అంతర్గత రహదారులు, విద్యుత్, పచ్చదనం పెంపు, కమ్యూనిటీ హాల్, ప్రార్థన మందిరాలు తదితర వాటికి స్థలాలు కేటాయించాల్సి ఉంటుంది. లేఅవుట్‌ప్రాంతం ఉన్న గ్రామపంచాయతీకి ఫీజు చెల్లించాలి. వ్యవసాయ భూముల్లో లేఅవుట్లువేస్తే ముందుగా రెవెన్యూ వారికి దరఖాస్తు చేసుకొని రుసుం చెల్లించి ల్యాండ్‌కన్వర్షన్ చేయించుకోవాలి. అయితే ఇక్కడ వెలుస్తున్న లేఅవుట్‌లో ఎక్కడ కూడా నిబంధనలు పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

వాగులను, వంకలను కలిపేస్తూ...

రంపతాడు రెవెన్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబర్లు 217, 218, 196లలో 9.70 ఎకరాలలో ప్రైవేట్ వెంచర్ వేశారు. ఎన్నో ఏళ్ల నుంచి కాలిబాట ఉంది. ఈ వెంచర్‌కు కాలిబాట అడ్డురావడంతో దాన్ని ఆక్రమించేసి ప్రహరీగోడ నిర్మించారు. కాలిబాటను ప్రభుత్వ భూమిలోకి మళ్లించారు. యూనివర్సిటీకి ఆనుకొని మల్లయ్యపల్లె వంక నుంచి అల్లాడుకుంట చెరువుకు నీరు వచ్చే కాల్వను కూడా ఆక్రమించేశారు. ఈ చెరువు కింద రైతులకు సాగుభూమి కూడా ఉంది. వెంచర్‌లో కాలిబాట, కాల్వ కలిసి దాదాపు 45సెంట్లు భూమిని ఆక్రమించేశారని స్పందన కార్యక్రమంలో గ్రామ సర్పంచు ఫిర్యాదు చేశాడు. ఇప్పటికి రెవెన్యూ అధికారులు స్పందించలేదు. వెంచర్లు వేసేటపుడు కనీసం ఆగ్రామ పంచాయతీల తీర్మానాలు కూడా తీసుకోకుండానే వేస్తున్నారు.

శ్మశానాన్ని కలిపేసుకొని...

యోగివేమన యూనివర్సిటీ సమీపంలో సుమారు 50 ఎకరాల్లో వెంచర్‌వేశారు. ఇక్కడ వాగును, శ్మశానాన్ని కలిపేసుకొని లేఅవుట్ వేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇలాంటి అనేక ప్రైవేట్ వెంచర్లలో సోగలపల్లె, నందిమండలం, పెండ్లిమర్రి, వెల్లటూరు, ఇసుకపల్లె, తిప్పిరెడ్డిపల్లె, రంపతాడు, మొయిళ్ల కాల్వ తదితర గ్రామాల రెవెన్యూ పరిధిలో ప్రైవేటు వెంచర్లు వెలిశాయి.

మోసపోతున్న జనం

రియల్టర్లు చెప్పే మాయమాటలు నమ్మి జనం అనుమతులు లేని లేఅవుట్లలో స్థలాలు కొనుగోలు చేస్తున్నారు. అలా కొన్న స్థలంలో ఇల్లు కొట్టుకొని బ్యాంకు రుణం తీసుకోవాలన్నా రాదు. రిజిస్ట్రేషన్ కూడా కాదు. ఇవన్నీ తెలియక జనం ప్లాట్లు కొనుగోలు చేసి ఇబ్బందులు పడుతున్నారు.


కఠిన చర్యలు తీసుకుంటాం..

ప్రభుత్వ భూములు, వాగులు, వంకలు, శ్మశానాలు ఆక్రమించి వెంచర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. యోగివేమన యూనివర్శిటీ వద్ద వేసిన వెంచర్‌లో కాలిబాట, కాల్వను ఆక్రమించి కాంపౌండ్ నిర్మించారని రెవెన్యూ అధికారుల దృష్టికి వచ్చింది. విచారణ చేసి తొలగిస్తాం.

- శ్రీనివాసులు, ఆర్ఐ, పెండ్లిమర్రి

కారు ఢీ... వ్యక్తికి తీవ్ర గాయాలు

రైల్వేకోడూరు, జూలై 9: మండలంలోని రాఘవరాజపురం వద్ద మంగళవారం కారు మోటారు బైక్‌ను ఢీకొన్న సంఘటనలో సుధాకర్‌రాజు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బొమ్మవరం గ్రామానికి చెందిన సుధాకర్‌రాజు రైల్వేకోడూరుకు తన మోటారు సైకిల్‌లో వస్తుండగా రాఘవరాజపురం వద్ద ఓ కారు అతివేగంగా వచ్చి ఢీకొంది. దీంతో అతని మోకాలికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.



వేర్వేరు చోట్ల రైలు కింద పడి ఇద్దరు మృతి




మామిడి సుబ్బారెడ్డి మృతదేహం, ఆత్మహత్యకు పాల్పడ్డ దేవరశెట్టి భాస్కర్

కడప (క్రైం)/ సిద్దవటం, జూలై 9: జిల్లాలో వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు రైలుకింద పడి మృతి చెందారు. కడప నగరం రైల్వే స్టేషన్ సమీపంలో ఒకరు రైలుకింద పడి ఆత్మహత్య చేసుకోగా... వస్‌మాధవరం వద్ద రైలు ట్రాక్ దాటుతూ ప్రమాదవశాత్తు రైలు కింద పడి మృతి చెందాడు. కడప రైల్వే పోలీసుల వివరాల మేరకు... కడప నగరం ఎర్రముక్కపల్లెలోని గాంధీనగర్‌కు చెందిన దేవరశెట్టి భాస్కర్ (52) ఆటోడ్రైవరుగా జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్లక్రితం కుమార్తె వివాహ సందర్భంగా చేసిన అప్పులు తీర్చలేక తీవ్ర మనస్తాపానికి గురై మంళవారం ఉదయం కడప రైల్వేస్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించి.. కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిద్దవటం మండలం వస్‌మాధవరానికి చెందిన మామిడి సుబ్బారెడ్డి (67) మేకలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం మేకలు కాసుకుంటుండగా.. రైల్వేట్రాక్‌పైకి వెళ్లడంతో వాటిని పక్కకు తోలేందుకు పోగా రైలు వచ్చి ఢీకొంది. దీంతో రామసుబ్బారెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. రెండు మేకలు కూడా మృతి చెందాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు.

కొత్తపేట రామాపురంలో వ్యక్తి ఆత్మహత్య

రాయచోటిటౌన్, జూలై 9: రాయచోటి పట్టణంలోని కొత్తపేట రామాపురంలో నివాసం ఉంటున్న ఈశ్వర్‌రెడ్డి (36) అనే వ్యక్తి మంగళవారం తన ఇంట్లో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు... రాయచోటి మండలం యండపల్లె గ్రామం పెద్దరామిరెడ్డిగారిపల్లెకు చెందిన ఈశ్వర్‌రెడ్డి కుటుంబం గత కొన్ని సంవత్సరాలుగా కొత్తపేట రామాపురంలో నివాసం ఉంటున్నారు. అయితే ఈశ్వర్‌రెడ్డి తండ్రితో పాటు సోదరుడు గతంలో మృత్యువాత పడ్డారు. తల్లి కువైత్‌లో ఉంటోంది. రెండేళ్ల క్రితం ఈశ్వర్‌రెడ్డికి వివాహం అయి నప్పటికీ ఆరు నెలలుగా భార్య ఇతనికి దూరంగా అమ్మగారి ఇంటి వద్ద ఉంటోంది. ఇతనికి మద్యం అలవాటుతో పాటు కొద్దిగా మతిస్థిమితం కూడా సరిగ్గా లేదని బంధువులతో పాటు చుట్టుపక్కల వారు చెబుతున్నారు. ఈ క్రమంలో ఇతను సొంత ఇంటిలోనే ఒంటరిగా ఉంటున్నాడు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఇంటికి గడియపెట్టి ముందుగా తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. అతను కేకలు వేయడంతో పాటు మంటలు పొగ బయటకు రావడంతో చుట్టుపక్కల వారు తలుపు పగలగొట్టి చూశారు. అప్పటికే ఈశ్వర్‌రెడ్డి మంటల్లో కాలి మృతి చెందాడు. సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగలు బాబోయ్ దొంగలు

- ఒకే రాత్రి ఆరు చోట్ల దొంగతనం

ఖాజీపేట, జూలై 9: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని కోటంగురాయునిపల్లె వద్ద సోమవారం రాత్రి ఆరు చోట్ల చోరీలు జరిగాయి. వివరాల్లోకి వెళితే... కోటంగురాయుపల్లె వద్ద రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణాల వారు రోజు దినచర్యలో భాగంగా వ్యాపారం చేసుకుని తాళాలు వేసి వెళ్లిపోయారు. అయితే రాత్రి దొంగలు పైకప్పు ఉన్న రేకులను కట్ చేసి ఆరు దుకాణాల్లోకి దిగి వస్తువులు చిందరవందర చేసి క్యాస్‌పెట్టెల్లో ఉన్న రూ.3 వేలు నగదు తీసుకెళ్లారు. అలాగే బస్టాండులోని హైస్కూలు వెనుకభాగంలో ఉన్న మేడపైన ఇంటికి తాళం పగులకొట్టి రూ.20 వేలు నగదు తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ రామాంజులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతులు ఎర్రచందనం మొక్కలను నాటుకోండి

- మూడేళ్ల వరకు సంరక్షణ బాధ్యత అటవీశాఖదే.. ● రాష్ట్ర బయోడైవర్శిటీ బోర్డు కార్యదర్శి క్రిష్ణమూర్తి



మాట్లాడుతున్న రాష్ట్ర బయోడైవర్శిటీ బోర్డు కార్యదర్శి క్రిష్ణమూర్తి

రైల్వేకోడూరు, జూలై 9: రైతు పొలాల్లో నాణ్యత గల ఎర్రచందనం మొక్కలను నాటుకోవాలని, మూడేళ్ల వరకు అటవీశాఖ వాటి సంరక్షణ బాధ్యత తీసుకుంటుందని రాష్ట్ర బయోడైవర్శిటీ బోర్డు కార్యదర్శి క్రిష్ణమూర్తి తెలిపారు. మంగళవారం రైల్వేకో డూరు అటవీశాఖ అతిథిగృహంలో రైతులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు చెందిన ఖాళీ స్థలాల్లో ఎర్రచం దనం మొక్కలను నాటుకుంటే మంచి రేటుకు అమ్ముకునే అవకాశాలు ఉంటా యన్నారు. గతంలో అటవీశాఖ అనుమతి కోసం కాళ్లు అరిగేలా రైతులు తిరిగే వారని... ప్రస్తుతం ఆ పరిస్థితులు ఉండవని తెలిపారు. రైతుల పొలాల్లో ఎర్రచం దనం మొక్కల పెంపకం చేపట్టిన నాటి నుంచి డేటా ఆన్‌లైన్ ఉంటుందన్నారు. జియోట్యాగ్ చేస్తారన్నారు. మొక్కలు పెరిగిన తర్వాత చెట్లను అమ్ముకోవ డానికి సులువుగా ఉంటుందన్నారు. ఇందులో ఎలాంటి అపోహలకు తావు లేదన్నారు. మంచి నాణ్యత కల్గిన విత్తనం ఎంపిక చేసుకోవాలన్నారు. రైతు మొక్కలను నాటి నాటి నుంచి రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు. ఎర్రచందనం కొనుగోలు చేసేందుకు చాలా కంపెనీలు ముందుకు వస్తున్నాయని తెలిపారు. రాజంపేట డివిజనల్ అటవీశాఖ అధికారి వివేక్ మాట్లాడుతూ రైతులందరూ అసోషియేషన్‌గా ఏర్పడి ఎర్రచందనం బొమ్మలను తయారు చేసి అమ్ముకునే అవకాశాలు ఉంటా యన్నారు. చాలా మందికి ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో తమిళనాడు రిటైర్డ్ పీసీసీఎఫ్ బాలాజీ, కర్ణాటకకు చెందిన వైఎస్ చాన్సలర్ హన్సిలాల్, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ సంగరాజు రవికుమార్‌రాజు, రైల్వేకోడూరు అటవీశాఖ రేంజర్, బాలపల్లె రేంజర్ ప్రభాకర్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- మంత్రి చొరవతో మూడు గంటల్లో పరిష్కారం
- కృతజ్ఞతలు తెలిపిన రైతు



ఖాజీపేట, జూలై 9: మండలంలోని నాగసానిపల్లె గ్రామానికి చెందిన అబ్బయ్య అనే రైతు గత కొన్ని సంవత్సరాలుగా తన పొలంలో విద్యుత్ తీగలు కిందకు వేలాడుతుండటంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి. ఈ విషయం పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. ఈ నేపథ్యంలో మంగళవారం పంట సాగు చేసేందుకు పొలానికి వెళ్లిన రైతు విద్యుత్తు వైర్లు కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్న విషయాన్ని ఫోటోలు తీసి ప్రసార మాధ్యమాల్లో పెట్టాడు. అది వైరల్ కావడంతో మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి వెళ్లాయి. మంత్రి వెంటనే స్పందించి విద్యుత్ తీగలు సరిచేయాలని ఎస్‌ఈకి ఆదేశాలు ఇచ్చారు. ఈ మేరకు ఖాజీపేట ఏఈ మూడు గంటలలోపే సమస్యను పరిష్కరించారు. ఏళ్ల తరబడి పరిష్కారం కాని సమస్యకు పరిష్కారం దొరకడంతో రైతు మంత్రికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



పోగొట్టుకున్న బంగారు నగలు అప్పగింత



బాధితులకు నగలు అప్పజెబుతున్న ఎస్ఐ

నందలూరు, జూలై 9: పోగొట్టుకున్న బంగారు నగలును బాధితులకు పోలీ సులు అప్పజెప్పిన సంఘటన సోమ వారం రాత్రి చోటు చేసుకుంది. ఈ సంఘటనపై ఎస్ఐ మహ్మద్ అబ్దుల్ జహీర్ మాట్లాడుతూ.. ఆకేపాడు రామిరెడ్డిపల్లెకు చెందిన ఆవుల కిషోర్ రెడ్డి, ఆవుల కవిత సోమవారం రాత్రి సిద్దవటం నుంచి తన స్వగ్రామానికి వెళుతూ నందలూరులోని క్రిష్ణా స్వీటు షాపులో స్వీట్లు కొనుగోలు చేశారు. తిరిగి ఆకేపాడుకు వెళ్లి చూసుకోగా.. వారి బంగారు నగలు పోయినట్లు గుర్తించారని తెలిపారు. వెంటనే బేకరికి వెళ్లి వెతకగా అక్కడ బ్యాగు కనపడక పోవడంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బ్యాగులో 4 గాజులు, ఒక లాంగ్‌చైన్ మొత్తం 13 తులాల బంగారు ఉందని తెలి పా రు. వెంటనే తాము సీసీ పుటే జిలను పరిశీలించగా... కారులో నుంచి మహిళ దిగే టప్పుడు బ్యాగు పడిపోవడంతో అక్కడే ఉన్న ఓ వ్యక్తి తీసుకోవడం గుర్తించాం. ఆ వ్యక్తిని పిలిపించి నగల బ్యాగును బాధితులకు అందజేశామని ఎస్ఐ తెలిపారు.



ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం

సంగం, జూలై 9: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఓ యువకుడి మాయమాటలు నమ్మి ఇద్దరు బాలికలు ఇల్లు విడిచి 120 కిలోమీటర్ల దూరం వెళ్లారు. పాఠశాలకు వెళ్లిన బాలికలు సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళన చెంది విచారించారు. పాఠశాలకు రాలేదని తేలడంతో పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు చొరవతో ఎట్టకేలకు ఇద్దరు బాలికలు క్షేమంగా ఇల్లు చేరారు. వివరాల్లోకి వెళితే.. పొదలకూరు మండలంలోని వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు బాలికలు స్నేహితులు. వీరు సంగంలోని ఓ పాఠశాలలో ఒకరు పది, మరొకరు ఇంటర్ చదువుతున్నారు. ఈ క్రమంలో సోమవారం పాఠశాలకని ఇంటి నుంచి వచ్చిన వారు అదృశ్యమయ్యారు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో వారి తల్లిదండ్రులు పాఠశాలలో విచారించారు. ఇద్దరు పాఠశాలలకు రాలేదని తేలింది. అయితే వారిలో ఓ బాలిక తనతల్లి ఫోన్‌ను వినియోగిస్తున్నది. అనుమానంతో ఫోన్‌ను పరిశీలించగా ఓ యువకుడితో ఇన్‌స్టాగ్రామ్‌లో చాటింగ్ చేసినట్లు గుర్తించారు. ఆ ఫోన్ నెంబరుతో పోలీసులను సంప్రదించారు. వెంటనే పోలీసులు ఫోన్ సిగ్నల్‌ను కనిపెట్టే ప్రయత్నాలు ప్రారంభించారు. కడప జిల్లా సింహాద్రిపురం వద్ద సిగ్నల్ ఆచూకీ లభ్యమైయింది. ఆ యువకుడి పేరు శివప్రసాద్‌గా పోలీసులు గుర్తించారు. ఫోన్‌లో ఆ యువకుడితో మాట్లాడడంతో ఇద్దరు బాలికలు అక్కడికి చేరినట్లు నిర్ధారణ అయింది. వెంటనే సంగం పోలీసులు అక్కడి పోలీసులకు సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న యువకుడు ఇద్దరు బాలికలను సింహాద్రిపురం బస్టాండ్‌లోని ఓ కూరగాయల దుకాణం వద్ద వదిలేశాడు. సింహాద్రిపురం పోలీసులు సంఘటనా స్థలం వద్దకు వెళ్లి ఇద్దరు బాలికలను అదుపులోకి తీసుకున్నారు. విషయం తెలుసుకున్న వారి తల్లిదండ్రులు సోమవారం అర్ధరాత్రి సింహాద్రిపురం బయలుదేరి వెళ్లారు. ఎట్టకేలకు పోలీసుల చొరవతో ఇద్దరు బాలికలు క్షేమంగా ఇంటికి చేరారు. కాగా బాలికలను మాయలో పడేసిన ఆ యువకుడు పరారీలో ఉన్నాడు. ఆ యువకుడికి గతంలోనే వివాహమై భార్యతో ఏర్పడిన మనస్పర్థల కారణంగా విడిపోయినట్లు విశ్వసనీయ సమాచారం.

- యువకుడి కోసం సింహాద్రిపురం చేరిన ఇద్దరు బాలికలు ● పాఠశాలకని వచ్చి అదృశ్యం
- పోలీసులను ఆశ్రయించిన తల్లిదండ్రులు ● వారి చొరవతో విద్యార్థులు క్షేమంగా ఇంటికి...



జ్యోతి గ్రామంలో ఇసుక రీచ్ పరిశీలన



ఇసుక రీచ్ పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఆర్డీవో వెంకటపతి

సిద్దవటం, జూలై 9 : మండలంలోని జ్యోతి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్‌లను కడప జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటపతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి అనుమతిలేనిచోట ఇసుకను తవ్వి తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమతి ఉన్న రీచ్‌ల నుంచి మాత్రమే ఇసుకను తీసుకెళ్లాలని తెలిపారు. రీచ్‌లవద్ద ఎల్లవేళలా సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉండాలని, ప్రతి ఇసుక వాహనానికి రవాణా బిల్లు ఇవ్వాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు మురాద్దావలీ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అనూరాధ, ఏపీఎం వెంకటేశ్వర్లు, పంచాయతి సెక్రెటరీ విజయ్, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి దృష్టికి కోడూరు సమస్యలు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి

రైల్వేకోడూరు(రూరల్) జూలై 9: కోడూరు నియోజకవర్గ దీర్ఘకాలిక సమస్యలను రాష్ట్ర రవాణా యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి కస్తూరి విశ్వనాథ నాయుడు తెలిపారు. మంగళవారం రాయచోటిలో మంత్రి స్వగ్రామంలో కలిసినట్లు తెలిపారు. ముఖ్యంగా రైల్వేకోడూరు ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని, తిరుపతి, కడపకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం కోసం కోడూరు నుంచి అదనంగా బస్సులు కేటాయించాలని కోరినట్లు తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో మొదలైన రెడ్డివారిపల్లె బ్రిడ్జి, బుడుగుంటపల్లెకు వెళ్లె అండర్ వే బ్రిడ్జి పనులు నత్తనడకగా సాగుతున్నాయని వివరించామన్నారు. కోడూరు అభివృద్ధి అంశాన్ని ముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళతానని మంత్రి హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాచినేని విశ్వేశ్వర నాయుడు, ఓబులవారిపల్లె మాజీ జడ్పిటీసీ నాయుడోరి రమణ, ప్రముఖ లాయర్ రెడ్డయ్య, ఎస్సీ జిల్లా నాయకులు పులెల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలసిన సిద్దవటం నేతలు

సిద్దవటం : రాష్ట్ర రవాణా యువజనశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మంగళవారం కడప ఆర్ అండ్ బీ బంగ్లాలో రాష్ట్ర పంచాయితిరాజ్ చాంబర్ కన్వీనర్, టీడీపీ నేత కుప్పాల వెంకటసుబ్బయ్య, టీడీపీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సిద్దవటం మండలంలోని పలు సమస్యలను ఆయనకు వివరించారు. మంత్రి సానుకూలంగా స్పందించి ఎప్పుడు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్ పట్టివేత

రాజంపేట టౌన్, జూలై 9 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్ వాహనాన్ని రాజంపేట పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ మదయ్య ఆచారి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజంపేట మండల పరిధిలోని మందరం గ్రామ సమీపంలోని రీచ్ నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లి వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న వాహన యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

కారు - ద్విచక్ర వాహనం ఢీ.. ఒకరికి గాయాలు

ఓబులవారిపల్లె, జూలై 9 : కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఒ వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే బొమ్మవరం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఉమ్మలరాజు పిచ్చిరాజు కుమారుడు సుధాకర్‌రాజు బొమ్మవరం నుంచి రైల్వేకోడూరుకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా మార్గమధ్యలో కారు ఢీకొంది. దీంతో అతని కుడికాలుకు తీవ్ర గాయాలు కాగా, మరో కాలు స్వల్పంగా గాయపడింది. స్థానికులు అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసి, క్షతగాత్రుడిని కోడూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం తిరుపతి తరలించాలని సూచించారు.మార్కెట్‌యార్డు కమిటి మాజీ చైర్మన్ సంగరాజు రవికుమార్‌రాజు ఆసుపత్రికి వెళ్లి సుధాకర్ రాజును పరామర్శించారు.

వృక్షాలతో పర్యావరణ సమతుల్యత

పుల్లంపేట, జూలై 9 : వృక్షాలతోనే పర్యావరణ సమతుల్యత ఏర్పడుతుందని కెనరాబ్యాంకు మేనేజర్ బి.నవీన్ రాజు తెలిపారు. ప్లాంట్ ఫర్ మదర్ ఎర్త్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక ఎస్‌బీవీడీ సభా జూనియర్ కళాశాలలో కెనరా బ్యాంకు సిబ్బంది వేప మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో నాటిన మొక్కలు బాగా పెరిగి వృక్షాలు అవుతాయని దీనివల్ల వాతావరణ సమతుల్యత ఏర్పడుతుం దన్నారు. కార్యక్రమంలో సిబ్బంది దిలీప్ కుమార్‌రెడ్డి, మనీషా, లక్ష్మీరెడ్డి, పెంచలమ్మ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి

● కలెక్టర్ శ్రీధర్ చామకూరి



తహసీల్దారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్ చామకూరి

రాజంపేట, జూలై 9 : ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, ఈ క్రమంలో ఎటువంటి సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలని, కలెక్టర్ శ్రీదర్ చామకూరి సూచించారు. మంగళవారం రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవో మోహన్‌రావుతో కలిసి డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల్లో ప్రధాన సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. తహసీల్దార్లు వారం వారం సమీక్షించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర తదితరులు కలెక్టరును కలిసి సంక్షేమ హాస్టళ్లలో వసతులు మెరుగుపరచాలని, కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం పటిష్టంగా అమలు చేయాలని, కూలిపోతున్న హాస్టల్ భవనాలను పునరుద్ధరించాలని, హాస్టల్ విద్యార్థులకు బిల్లులు రాక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ వినతిపత్రం సమర్పించారు.

కలెక్టర్‌ను కలసిన టీడీపీ నేతలు

కలెక్టర్ రాజంపేట సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు గన్నే సుబ్బనరసయ్యానాయుడు, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు చుండు సుధీర్, తెలుగు యువత పార్లమెంట్ అధికార ప్రతినిధి శింగన పరశురాం, మైనార్టీ నాయకులు ఎస్‌కె కరీం, మాజీ సర్పంచ్ అరుణాచలం, కొల్లా వెంకటసుబ్బయ్య, ఊటుకూరు టీడీపీ సీనియర్ నేత మలిశెట్టి సుబ్బరాయుడు, కిరణ్ తదితరులు ఆయనను కలిసి శాలువాలు కప్పి, పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజంపేట సమస్యలను కలెక్టర్ దృష్టికి తెచ్చారు.

ఉచిత ఇసుక విధానం ముఖ్యమంత్రి ఘనతే: మంత్రి మండిపల్లి

●చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



రాయచోటిలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి మండిపల్లి



ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్నజగన్‌మోహన్‌రాజు

రాయచోటి టౌన్, జూలై 9: ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఉచితంగా ఇసుక అందించే పాలసీని అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కు తుందని రాష్ట్ర రవాణా, క్రీడల శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళ వారం రాత్రి పట్టణంలోని తన క్యాంపు కార్యా లయంలో చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభి షేకం చేశారు. అనంతరం మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పాటైన 20 రోజుల్లోనే ఉచిత ఇసుక పాలసీ అమలులోకి రావడం గర్వకారణమన్నారు.

రాజంపేట: రాష్ట్రంలో నూతన ఇసుక విధానం ప్రా రంభించిన సందర్భంగా రాజం పేట పార్లమెంట్ టీడీపీ అధ్య క్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు ఆధ్వర్యంలో మంగళ వా రం రాజంపేటలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటాన్ని పాలతో అభిషేకిం చారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడు తూ జగన్ మోహన్ రెడ్డి అడ్డగోలు విధానాలతో ఇసుక అందక సా మాన్య ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో గుల్జార్ బాషా, కోవూరు సుబ్రమణ్యం నా యుడు, అమ్మినేని అజయ్ కుమార్, సతీష్‌కుమార్‌రాజు, అబూ బకర్, కరీం, కోటయ్య నాయుడు, సుబ్బరాజు, సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల నెరవేర్చేందుకే ఉచిత ఇసుక పాలసీ

● రాజంపేట టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాల సుబ్రమణ్యం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సుగవాసి బాల సుబ్రమణ్యం

రాయచోటిటౌన్, జూలై 9: పేదల సొంతింటి కల నెరవేర్చడం కోసమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చారని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాల సుబ్రమణ్యం అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానికంగా ఉన్నత కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఇంటి నిర్మాణం కోసం పేదవాళ్లు ఐదు లక్షల ఖర్చు చేస్తే, అందులో మూడు లక్షలు ఇసుకకే సరిపోయేదన్నారు. దీంతో ఎంతో మంది పేదలు ఇసుక కొనుగోలు చేయలేక ఇబ్బందులు పడేవారన్నారు. పేదల ఇబ్బందులను, భవన నిర్మాణ కార్మికుల సమస్యలను కళ్లారా చూసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ఇసుక పాలసీని తీసుకొచ్చారన్నారు. వైసీపీ నేతలు రూ. 50 కోట్ల విలువైన ఇసుక దోచుకున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం భవిష్యత్తులో కూడా పేదలకు మేలు చేసే విధంగా అన్ని కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక చట్టాల అమలుకు నిరసనగా నేడు ధర్నా

రాయచోటిటౌన్, జూలై 9: కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కార్మిక కోడ్‌లను అమలు చేయాలని, కార్మిక హక్కులను కాలరాయడానికి బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నానికి నిరసనగా సీఐటీయూ ఆల్ ఇండియా కమిటీ, రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ చంద్రశేఖర్, అబ్బవరం రామాంజులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంస్థలను అమ్మేయడమే ప్రధానమైన లక్ష్యంగా కేంద్రప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. ఎల్‌ఐసీ, బీఎస్ఎన్ఎల్, పోస్టల్, బ్యాంకింగ్, డిఫెన్స్, రైల్వే, పోర్టుల ప్రైవేటీకరణ దుర్మార్గమన్నారు. కార్మిక వ్యతిరేక చట్టాలను, లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి తీవ్ర ప్రయత్నం చేయడం దారుణమన్నారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రైల్వేకోడూరు: రైల్వేకోడూరులో మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. కార్మికులకు సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలని కోర్టులు తీర్పులు ఇచ్చినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అంగన్వాడీలు గత ప్రభుత్వంలో పోరాడి సాధించుకున్న మినిట్స్‌కి, జీవోలు విడుదల చేయాలన్నారు. విశాఖ స్టీలు ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలన్నారు. అన్ని శాఖల అధికారులపై రాజకీయ వేధింపులను ఆపాలన్నారు. అంగన్వా డీలు, ఆశ కార్యకర్తలు, మున్సిపల్, కాంట్రాక్టు తదితరులకు వెంటనే జీతాలు పెంచాలన్నారు. ఆటో, హమాలీ, బిల్డింగ్, తోపుడు బండ్లు, బీడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు.

ప్రతి పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ తప్పనిసరి


● స్టేట్ ట్రైనింగ్ కమిషనర్ ఉమాదేవి



కస్తూరిబా పాఠశాల బాలికలతో మాట్లాడుతున్న స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ ట్రైనింగ్ కమిషనర్ ఉమాదేవి

రాయచోటిటౌన్, జూలై 9: ప్రభుత్వ, జిల్లా పరిషత్, ఏపీ మోడల్ స్కూళ్లతో పాటు అన్ని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌ను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ స్టేట్ ట్రైనింగ్ కమిషనర్, రాయలసీమ జోన్ ఇన్‌చార్జి ఉమాదేవి తెలిపారు. స్టేట్ సెక్రటరీ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం రాయచోటిలోని కస్తూరిబా గాంధీ విద్యాలయంలోని భారత్ స్కౌట్స అండ్ గైడ్స్ యూనిట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తి, అంకితభావం పెంపొందడానికి స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణ తోడ్పడుతుందన్నారు. అంతేగాక స్కౌట్స్ శిక్షణ ద్వారా విద్యార్థుల్లో శారీరక దారుఢ్యంతో పాటు మానసిక వికాసం , ఉజ్వల భవిష్యత్తు, ఉన్నత విలువలు సమకూరతాయన్నారు. ప్రతి పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్ ఏర్పాటుకై తమ పాఠశాల తరపున 381 రూపాయలు చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. పాఠశాలలో ఉన్న విద్యార్థుల సంఖ్య ఆధారంగా యూనిట్లను ఏర్పాటు చేసుకునే సౌలభ్యం ఉందన్నారు. తమ పాఠశాలలో ఉన్న ఉపాధ్యాయుల్లో ఒకరిని స్కౌట్స్ మాస్టర్‌గా, మరొకరిని గైడ్స్ కెప్టెన్‌గా నియమించుకోవచ్చు నన్నారు. అనంతరం విద్యార్థుల ఎంపికను పూర్తి చేయాలన్నారు. గత సంవత్సరం యూనిట్ ఏర్పాటు కోసం రిజిస్ట్రేషన్ చేసిన వారు ఈ సంవత్సరం కూడా తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలన్నారు. బాలురు (స్కౌట్స్), బాలికలు (గైడ్స్)తో కూడిన స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్స్‌లలో బాలురకు ఒక యూనిట్, బాలికలకు మరొక యూనిట్ ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటే అదనపు యూనిట్లను కూడా ఏర్పాటు చేసుకోవచ్చునన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభంలోనే స్కౌట్ మాస్టర్లకు, గైడ్ కెప్టెన్లకు బేసిక్ శిక్షణను ఇచ్చి వారికి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. అనంతరం అన్నమయ్య జిల్లా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్‌లో చేరిన విద్యార్థులకు రెండేళ్ల శిక్షణ, క్యాంపుల్లో భోజన వసతి కల్పిస్తామన్నారు. శిక్షణలో తృతీయ సోపానం, రాజ్యపురస్కార కోర్స్ ఎగ్జామ్స్ నిర్వహించి ప్రతిభ చూపిన వారికి గవర్నర్ జారీ చేసిన సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. స్కౌట్స్ అండ్ గైడ్స్ సర్టిఫికెట్ కలవారికి జీవో నెంబర్ 27 ప్రకారం విద్యా, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం సంబేపల్లె, రామాపురం మండలాల కస్తూరిబా గాంధీ విద్యాలయాల్లోని భారత్ గైడ్స్ యూనిట్లను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ రాధా, అసిస్టెంట్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషన్ లక్ష్మీకర్, గైడ్ కెప్టెన్లు రమీజా, పుష్పాంజలి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌సీ మూల్యాంకన రెమ్యునరేషన్ చెల్లించండి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

రాయచోటిటౌన్, జూలై 9: పదవ తరగతి పరీక్షల మూల్యాంకన విధుల్లో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పూర్తి స్థాయిలో రెమ్యూనరేషన్ చెల్లించుటకు చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో ఆందోళన చేస్తామని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, జాబీర్ హెచ్చరించారు. మంగళవారం వారు యూటీఎఫ్ నేతలతో కలిసి అన్నమయ్య జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పది రోజుల్లో టీఏ, డీఏ రెమ్యూనరేషన్ బకాయిలు చెల్లించకపోతే డీఈవో కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామన్నారు. 2023 ఏప్రిల్‌లో జరిగిన పదవ తరగతి మూల్యాంకన విధులకు సంబంధించి న రెమ్యూనరేషన్ సైతం ఇంతవరకు చెల్లించలేదని పలుసార్లు జిల్లా విద్యాశాఖ అధికారి దృష్టికి తీసుకెళ్లి వెళ్లినా, స్పందన లేకపోవడంతో కలెక్టర్‌ను కలిసి విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సర మూల్యాంకన రెమ్యునరేషన్ చెల్లింపులో అలసత్వం ప్రదర్శించినవారిపూ చర్యలు తీసుకోవాలని కోరారు. 2023లో జరిగిన నిర్లక్ష్యం 2024లో కూడా పునరావృతం కావడం ఉపాధ్యాయులతో వెట్టిచాకిరి చేయించుకోవడానికి నిదర్శనమని వారు ఆక్షేపించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ చిన్నమండెం మండల అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి రాయచోటి మండల నాయకులు అమర్‌నాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అన్నమయ్య' బాధితులను ఆదుకోవాలి



మంత్రి రామానాయుడుకు వినతిపత్రం సమర్పిస్తున్న రాజంపేట నేతలు

రాజంపేట, జూలై 9 : అన్నమయ్య ప్రాజెక్టు బాధితులను ఆదుకోవడంతో పాటు, ఆ ప్రాజెక్టు దుస్థితికి కారణాలను గుర్తించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును రాజంపేట నాయకులు కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్ నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వేమన సతీష్, తెలుగు యువత నాయకుడు దుగ్గినేని చంద్రబాబు నాయుడు, కృష్ణ రాథోడ్ తదితరులు ఈ మేరకు మంగళవారం మంత్రికి వినతిపత్రం సమర్పించారు. వైసీపీ నేతల ఇసుక మాఫీయా కారణంగానే అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయిందని ఆరోపించారు. అన్నమయ్య ప్రాజెక్టు బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బస్సు సర్వీసులు పెంచండి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి సమస్యలు వివరిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

గాలివీడు, జూలై 9: ఉపాధ్యాయులు సకాలంలో పాఠశాలకు చేరుకునేందుకు వీలుగా రాయచోటి- గాలివీడు మార్గంలో బస్సు సర్వీసులను పెంచాలని కోరుతూ ఆపస్ అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షుడు దేరంగుల రామేశ్వర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాయచోటి నుండి గాలివీడుకు వస్తున్న ఉపాధ్యాయులు సకాలంలో బస్సులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. విద్యా వ్యవస్థకు గొడ్డలి పెట్టులాంటి జీవో నెంబర్ 117ను రద్దు చేసి ప్రాథమిక విద్యను కాపాడాలని కోరారు. ఇందుకు స్పందించిన మంత్రి బస్సు సర్వీసులను పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు చిన్నకోట్ల రమణ, వెంకట్రమణ పాల్గొన్నారు.

రవాణాశాఖ మంత్రిని కలిసిన యెద్దల విజయసాగర్

నందలూరు, జూలై 9 : కడప ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో ఆంధ్రప్రదేశ్ రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని రాజంపేట వ్యవసాయ మార్కెట్ మాజీ అధ్యక్షుడు యెద్దల విజయసాగర్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై మంత్రితో చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ఎస్సీ నాయకులు మోడపోతుల రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల గుర్తింపునకు కమిటీల ఏర్పాటు



మాట్లాడుతున్న ఆర్డీవో రంగస్వామి

సంబేపల్లె, జూలై 9: మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించేందుకు ప్రతి గ్రామానికి ఇద్దరు వీఆర్‌వోలు, ఇద్దరు సర్వేయర్లతో కమిటీ ఏర్పాటు చేశామని ఆర్డీవో రంగస్వామి తెలిపారు. మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములు గుర్తించాలని తెలి యజేశారు. ప్రతి రోజు సర్వే చేసి గుర్తించిన భూముల వివరాలను తహసీల్దార్‌కు తెలియజేయాలని వివరించారు. ఈ రోజు నుండే పనిలో నిమగ్నం కావాలని ఆదేశిం చారు. తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ రవి, ఆర్ఐ స్రవంతి, సర్వేయర్ రామాంజులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతు లు



పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సుండుపల్లె, జూలై 9: సుండుపల్లెకు తాగునీటిని అందించే పైపు లైను పాడైపోవడంతో మంగళవారం మరమ్మతులు చేసినట్లు ఈవోపీఆర్డీ సురేశ్‌బాబు తెలిపారు. బాహుదానది నుంచి మండల కేంద్రంలోని పలు వీధులకు తాగునీటిని సరఫరా చేసే పైపులైన్‌కు మరమ్మతులు చేసి నీటి సరఫరా చేస్తామన్నారు పారిశుధ్య, తాగునీటి సమస్యలను వెంటనే పంచాయతీ అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. నీరు వృథా చేయరాదని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేశ్‌బాబు, పంచాయతీ సహాయకులు పాల్గొన్నారు.

చిట్వేలిలో పారిశుధ్య పనులు




వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న సిబ్బంది

చిట్వేలి, జూలై 9 : గ్రామ పంచాయతీలో మూడు రోజుల పాటు పారిశుధ్య పనులు చేస్తున్నట్లు ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం చిట్వేలి పంచాయతీలో వర్షపునీరు నిలచిన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు, కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్‌రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామసుబ్బారెడ్డి, పంచాయతీ సిబ్బంది వెంకటేష్, నరసింహా, శివలక్ష్మి, మస్తాన్, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి 25 వేలు ఆర్థిక సాయం

చిట్వేలి, జూలై 9 : మండల పరిధిలోని తిమ్మాయపాలెం పంచాయతి గట్టుమీదపల్లె గ్రామానికి చెందిన అద్దంకి సురేష్ హార్ట్, లివర్, కిడ్నీల వ్యాధితో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబం కావడంతో కుటుంబ సభ్యులు మంగళవారం ముక్కా వరలక్ష్మికి తమ సమస్య వివరించగా, ఆమె రూ 25 వేల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వేణుగోపాల్‌రెడ్డి, మణి పాల్గొన్నారు. నిరుపేద కుటుంబం కావడంతో కుటుంబ సభ్యులు దాతల సహాయాన్ని కోరుతున్నారు. సహాయం అందించాల్సిన దాతలు 9652665667 నంబరుకు దాతలు సహకారం అందించాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

సౌమ్యనాథస్వామి ఆలయ హుండీ లెక్కింపు



హుండీలోని కానుకలు లెక్కిస్తున్న శ్రీ వారి సేవకులు

నందలూరు, జూలై 9 : నందలూరు సౌమ్యనాథ స్వామి ఆలయానికి హుండీలోని కానుకల ద్వారా 4.30,781 రూపాయల ఆదాయం వచ్చింది. మంగళవారం ఒంటిమిట్ట ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య ఆధ్వర్యంలో హుండీ లెక్కించారు. టీటీడీ విజిలెన్స్ అధికారులు దొరస్వామినాయుడు, గంగులయ్య, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్, శ్రీవారి సేవకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే ఏబీవీపీ లక్ష్యం



సుండుపల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

సుండుపల్లె, జూలై 9: విద్యారంగ సమస్యల పరిష్కారంలో ఏబీవీపీ విద్యార్థులకు అండగా ఉంటుందని ఏబీవీపీ అన్నమయ్య జిల్లా కన్వీనర్ నాగిరెడ్డి తెలిపారు. మంగళవారం ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవం, జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా సుండుపల్లె మండల కేంద్రంలో ఎంకేఆర్ జూనియర్ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థుల కోసం పోరాటాలే కాకుండా, విద్యా వ్యవస్థలోని లోపాలను ఎత్తి చూపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలియజేశారు. సేవా రంగంలోనూ ఏబీవీపీ ముందున్నదన్నారు. నందకిశోర్, హరి, సిద్దేశ్వర తదితరులు పాల్గొన్నారు.

రాయచోటిటౌన్: జాతీయ విద్యార్థి దినోత్సవం ఏబీవీపీ 76వ ఆవిర్భావ దినోత్సవాలను రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేటు జూనియర్ కళాశాలలో ఏబీవీపీ రాయచోటిశాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సందీప్ స్కూల్ కరస్పాండెంట్ వెంకట్రామిరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ పవన్ మాట్లాడారు. నందరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హరి, రాంప్రసాద్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాతో ఇద్దరు దివ్యాంగుల మృతి

రుయాలో చికిత్స పొందుతున్న 16మంది -పాస్ మనోవికాస్ కేంద్ర నిర్వాహకుల అలక్ష్యం - విచారణకు తిరుపతి కలెక్టర్ ఆదేశం



శేషాచలం మృతదేహం - స్విమ్స్‌లో చికిత్స పొందుతున్న ప్రదీప్



పాస్ మనో వికాస్‌కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్/వైద్యం), జూలై 9 : వారంతా మానసిక దివ్యాంగులు. తిన్న ఆహారం సరిపడక వాంతులు, విరేచనాలతో తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. వారిని ఆస్పత్రికి తరలించకుండా అందుబాటులో వున్న ఆయుర్వేద డాక్టరుతో వైద్యసేవలందించారు. పరిస్థితి విషమించడంతో ఆదివారం ఒకరు, సోమవారం మరొకరు చనిపోయారు.వివరాల్లోకి వెళితే....తిరుపతి రూరల్ మండ లం పద్మావతిపురంలోని పాస్ మనోవికాస్ మానసిక దివ్యాంగుల ప్రత్యేక ఆశ్రమ పాఠశాలలో బాల బాలికలతోపాటు 30 ఏళ్ల వయస్సు పైబడిన మానసిక వ్యాధిగ్రస్థులు, అనాథలు కలిపి 72 మంది ఆశ్రయం పొందుతున్నారు. వీరిలో 22మంది అనాథలు కాగా మరో 52మంది మానసిక వ్యాధులతో బాధపడే దివ్యాంగులు ఉన్నారు. వీరికి ఆదివారం సాయంత్రం ఆశ్రమ నిర్వాహకులు బోండాలు, సాంబారు కలిపి ఆహారం పెట్టారు. సోమవారం తెల్లవారుజామున కొందరికి వాంతులు, విరోచనాలు కావడంతో ఆశ్రమంలో ఉన్న ఆయుర్వేద డాక్టరు మందులు ఇచ్చారు.వాంతులు, విరోచనాలు ఆగకపోగా గణపతి(30) అనే వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురికావడంతో అతడిని సోమవారం ఉదయం రుయాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి గణపతి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. దీంతో గణపతికి అయిన వారు ఎవరూ లేకపోవడంతో ఆశ్రమ పాఠశాల నిర్వాహకులే గణపతి మృతదేహాన్ని ఆదివారం సాయంత్రం ఖననం చేశారు. ఆశ్రమంలో ఉన్న మరి కొందరికి కూడా వాంతులు, విరోచనాలు అవుతుండడంతో ఆశ్రమ నిర్వాహకులు అందుబాటులో ఉన్న ఆయుర్వేద వైద్యుడితో చికిత్స అందించారు. ఈ క్రమంలో తీవ్ర అస్వస్థతకు గురైన మరో అనాథ బాలుడు శేషాచలం(16) డయేరియా లక్షణాలతో మంగళవారం ఉదయం మృతిచెందాడు.ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పులివర్తి నాని అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. ఆర్డీవో నిశాంత్‌రెడ్డి, డీపీవో సుశీలాదేవి, డీఎంహెచ్‌వో శ్రీహరి పాస్ మనోవికాస్ కేంద్రానికి చేరుకుని డయేరియా లక్షణాలతో బాధపడుతున్న కొంతమందిని ఆస్పత్రికి తరలించారు. మెడికల్ క్యాంపులు కూడా ఏర్పాటు చేశారు. రుయాలో 16మంది చికిత్స పొందుతుండగా వారిలో ప్రదీప్(20), తేజస్విని(25) అనే ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం స్విమ్స్‌కు తరలించారు.పాస్ మనోవికాస్ కేంద్రంలో అసలేం జరిగిందనే విషయంపై కలెక్టర్ వెంకటేశ్వర్ విచారణకు ఆదేశించారు.దీంతో అక్కడ ఆహార పదార్థాలను, తాగు నీటిని పరీక్ష నిమిత్తం ల్యాబ్‌కు పంపారు.తాగు నీరు కలుషితం కాలేదని మంగళవారం రాత్రికి కలెక్టర్‌కు నివేదిక అందింది. కాగా కలెక్టర్ వెంకటేశ్వర్ రుయాస్పత్రిలో చికిత్స పొందుతున్న మానసిక దివ్యాంగులను పరామర్శించారు.అలాగే పాస్‌మనోవికాస్ మానసిక దివ్యాంగుల ఆశ్రమాన్ని సందర్శించారు.ఇంతమంది తీవ్ర అస్వస్థతకు గురైనా జిల్లా యంత్రాంగానికి తెలియకుండా ఎందుకు వుంచారంటూ నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమంలోని వంట గదిని, తాగునీటిని పరిశీలించాక దీనిపై సమగ్ర విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 16మంది ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని,వారి ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.శనివారం బోండాలు తినడం వలనే తీవ్ర అస్వస్థతకు గురైనట్లు అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు. తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి శేషాచలం మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు.

పాలిటెక్నిక్ ప్రవేశాలకు చివరి అవకాశం

పలమనేరు, జూలై 9: పాలిటెక్నిక్ ప్రవేశాలకు చివరి విడత ప్రకటన వెలువడినట్లు పలమనేరు మహిళా పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ మొహమ్మద్ మంగళవారం తెలిపారు. ఇదివరకే ప్రవేశాలు పొందిన విద్యార్థులు.. ఇంకనూ ప్రవేశాలు పొందని వారూ ఇప్పుడు తిరిగి వెబ్ ఆప్షన్‌ను నమోదు చేసుకొని సీట్లు పొందే అవకాశం ఉందన్నారు. ఇంకా సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసుకోనివారు ప్రాసెసింగ్‌ఫీజు చెల్లించి ఈనెల 11 నుంచి 13వ తేదిలోగా తమ సర్టిఫికెట్లను పరిశీలించుకోవాలని సూచించారు. 11 నుంచి 14వ తేది వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చన్నారు. సీట్ల కేటాయింపునకు సంబంధించి 16వ తేదీన సమాచారం వస్తుందన్నారు. సీట్లు పొందిన విద్యార్థులు తమ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఈనెల 18 నుంచి 20వ తేదీలోగా చేరాల్సి ఉంటుందన్నారు. ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికెట్ల వెరిఫికేషన్లను చిత్తూరు జిల్లా పరిసర ప్రాంతాల వారు తిరుపతిలోని ఎస్.వి. గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో చేసుకోవాలన్నారు. పలమనేరు పాలిటెక్నిక్‌లోని అన్ని విభాగాల్లోను సీట్లు మిగిలి ఉన్నాయని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకోసం 94414 83742 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

మామపై కోడలి దాడి



గాయపడ్డ రెడ్డప్ప

చౌడేపల్లె, జూలై 9: మామపై కోడలు కొడవలితో దాడి చేసిన సంఘటన చౌడేపల్లె మండలంలో సోమవారం రాత్రి జరిగింది. ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు.. కాగతి పంచాయతీ పలగార్లపల్లెకు చెందిన రెడ్డెప్ప(70), పార్వతమ్మ దంపతులు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. వీరి కుమారుడు గంగాధర్‌కు 14 ఏళ్ల క్రితం ఉమాదేవితో వివాహం చేశారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఒకటిన్నర ఏడాది కిందట కుటుంబ కలహాలతో గంగాధర్ ఆత్మహత్య చేసుకున్నారు. పక్క ఇంటిలో తన పిల్లలతో విడిగా ఉమాదేవి ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి రెడ్డెప్ప తన మనవళ్లకు స్నాక్స్ ఏమైనా తీసుకోమని చెరో వంద రూపాయలు ఇచ్చారు. తన పిల్లలకు ఎప్పుడు వందలు వందలు ఇస్తే ఎలాగని అత్త, మామలతో ఉమాదేవి గొడవ పడింది. ఈ గొడవ పెద్దదై సమీపంలో కొడవలితో మామపై దాడి చేసింది. ఈ దాడిలో ఆయన తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే కుటుంబీకులు ఆయన్ను పుంగనూరు ఏరియా ఆస్పత్రికి తరలించి చేయించారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండండి



వైద్యశిబిరాన్ని సందర్శిస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

వి.కోట, జూలై 9: జిల్లా వ్యాప్తంగా ప్రజలు జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి ప్రభావతిదేవి అన్నారు. మంగళవారం వి.కోట మండలం తోటకనుమ గ్రామంలో జ్వర మరణాలపై ఆమె ఆరా తీశారు. ఉదయాన్నే గ్రామానికి చేరుకున్న ఆమె జ్వరాలకు గల కారణాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నాలుగు రోజుల క్రితం డెంగ్యూ జ్వరంతో మృతి చెందిన స్వాతి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఇతర డెంగ్యూ జ్వర బాధితుల ఆరోగ్య పరిస్థితిపై విచారించారు. తోటకనుమతో పాటు పోతనపల్లెలోను వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యులు ఆమె దృష్టికి తెచ్చారు. మురుగునీటి కాలువలను క్రమం తప్పకుండా శుభ్రపరచాలని, క్లోరినేషన్ చేయించి కాచి వడబోసిన నీటిని తాగాలని ప్రజలకు సూచించారు. ఓవర్ హెడ్ ట్యాంకులను నీటిని నింపిన ప్రతిసారి క్లోరినేషన్ చేయించాలన్నారు. చీకటి పడిన తర్వాత ఫాగింగ్ చేయించాలని ఆదేశించారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వర కేసులపై ఆరా తీశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రతి జ్వరం కేసు సమాచారాన్ని సేకరించాలన్నారు. వారిలో కిట్ మెథడ్‌లో పాజిటివ్ వచ్చిన కేసుల నమూనాలను సేకరించి డెంగ్యూ నిర్ధారణ పరీక్ష (ఎలీసా) నిమిత్తం సమీపంలోని ఏరియా ఆస్పత్రులకు పంపాలని ఆదేశించారు. ఆమె వెంట ఎంపీడీవో గోవర్ధన్, వైద్యాధికారులు విజయ్‌కాంత్, మాధవి. అసిస్టెంట్ మలేరియాధికారి రామచంద్రారెడ్డి, సూపర్‌వైజర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు పారిపోయిన బాలికల అప్పగింత

తిరుపతి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇళ్లలో చెప్పకుండా వచ్చేసి రైల్వే ట్రాక్‌పై అనుమానాస్పదంగా సంచరిస్తూ కనిపించిన బాలికలను పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించిన ఘటన రేణిగుంట మండలంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చెన్నైలో ఇరుగుపొరుగు కుటుంబాలకు చెందిన ఇద్దరు బాలికలు భవన నిర్మాణ పనులకు కూలీలుగా వెళుతుంటారు. అదే పనుల్లో పరిచయమైన ఓ యువకుడితో కలసి ముగ్గురూ మంగళవారం చెన్నై నుంచి రైలులో రేణిగుంట బయల్దేరారు. మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో రైలు రేణిగుంట అవుటర్ సిగ్నల్ వద్ద ఆగడంతో ముగ్గురూ అక్కడ కిందకు దిగేశారు. రైలు వెళ్లిపోయాక ట్రాక్‌పై నడిచి వెళుతుండగా చూసిన కొందరు అనుమానంతో డయల్ 100కు ఫోన్ చేసి సమాచారమిచ్చారు. గాజులమండ్యం పోలీసులు వెళ్లేసరికి యువకుడు పరారయ్యాడు. బాలికలను పోలీసు స్టేషన్‌కు తరలించిన పోలీసులు విచారించి వివరాలు రాబట్టారు. ఇళ్లలో చెప్పకుండా వచ్చేసినట్టు తెలియడంతో వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి నిర్ధారించుకున్నారు. పరారైన యువకుడి గురించి ఆరా తీయగా తమకు తెలిసిన వ్యక్తేనని బాలికలు చెప్పారు. ఎస్పీ ఆదేశాలతో మహిళా హెడ్ కానిస్టేబుల్‌ను రక్షణగా పెట్టి చెన్నైకి పంపించారు. ఓ బాలిక తల్లిదండ్రులు అందుబాటులో లేకపోవడంతో మరో బాలిక తల్లిదండ్రులకు ఇద్దరినీ అప్పగించారు. కాగా ఈ ఘటనకు సంబంధించి రేణిగుంట అవుటర్ సిగ్నల్ వద్ద రైలు దిగిన బాలికలపై గంజాయి మత్తులో ఉన్న ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారని, వెంట ఉన్న యువకుడిపై కూడా దాడి చేశారని ప్రచారం జరిగింది. ఈ విషయమై ఎస్పీ హర్షవర్ధన్ రాజును వివరణ కోరగా.. బాలికలపై అత్యాచారం జరిగిందన్నది తప్పుడు ప్రచారమని ఖండించారు. ఇళ్లలో చెప్పకుండా వచ్చిన బాలికలను క్షేమంగా వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగిందని స్పష్టం చేశారు.

తాళం వేసిన ఇంట్లో భారీ చోరీ

320గ్రాముల బంగారం, 900 గ్రాముల వెండి ఆభరణాలు

రూ.3.50లక్షల అపహరణ



చిందరవందరగా ఉన్న బీరువా - వేలిముద్రలు సేకరిస్తున్న క్లూస్‌టీం

శ్రీకాళహస్తి, జూలై 9: శ్రీకాళహస్తి పట్టణం దక్షిణకైలాస్ నగర్ కాలనీలోని ఓ ఇంట్లో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. టూటౌన్ సీఐ రారాజు కథనం మేరకు.... పట్టణానికి చెందిన సిరాజ్ ఉన్నీసా తన కుమారుడితో కలిసి దక్షిణకైలాస్ నగర్ కాలనీలో అద్దె ఇంట్లో నివసిస్తోంది. ఆమె కుమార్తె, అల్లుడు చెన్నైలో ఉద్యోగం చేస్తున్నారు. ఇటీవల కూతురు, అల్లుడు తమిళనాడులోని వేర్వేరు ప్రాంతాలకు బదిలీ అయ్యారు. దీంతో సిరాజ్ ఉన్నీసా బంగారు ఆభరణాలను శ్రీకాళహస్తిలోని తన తల్లి వద్ద భద్రపరిచింది. ఆదివారం సిరాజ్ ఉన్నీసా కొడుకుతో కలిసి చెన్నైలోని కుమార్తె ఇంటికి వెళ్లింది. సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు తలుపులు పగులగొట్టి ఆమె ఇంట్లోకి ప్రవేశించారు. బీరువాలోని 40 సవర్లు(320) గ్రాములు బంగారు ఆభరణాలు, 900 గ్రాముల వెండి వస్తువులు, రూ.3.50లక్షల నగదు దోచుకెళ్లారు. మంగళవారం ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని పొరుగింటివారు గమనించి చెన్నైలో ఉన్న సిరాజ్ ఉన్నీసాకు సమాచారం అందించారు. ఆమె కొడుకుతో పాటు శ్రీకాళహస్తికి చేరుకుని ఇంటిని పరిశీలించారు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ రారాజు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. తిరుపతి నుంచి క్లూస్‌టీం బృందం వచ్చి వేలిముద్రల నమూనాలను సేకరించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు చోరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పరిశ్రమల ఏర్పాటుకు తరలిరండి

ఎంఎస్ఎంఈలకు కోసలనగరం అనుకూలం ● చెన్నైలో పారిశ్రామికవేత్తలతో నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ భేటీ



అంబత్తూరు ఇండస్ట్రియల్ మానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్‌తో సమావేశం నిర్వహిస్తున్న గాలి భానుప్రకాష్

నగరి, జూలై 9: సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు విజయపురం మండలం కోసలనగరం అనుకూల ప్రదేశమని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. మంగళవారం చెన్నైలో అంబత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ మానుఫ్యాక్చరింగ్ అసోసియేషన్‌తో ఆయన సమావేశమయ్యారు. ఏపీలో చంద్రబాబునాయుడు సారథ్యంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఇన్వెస్టర్ ఫ్రెండ్లీ ప్రభుత్వమని చెప్పారు. తయారీ రంగ పరిశ్రమలను ప్రత్యేకించి సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమలను ప్రోత్సహించేందుకు నూతన పాలసీని తీసుకురానున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో విరివిగా ఉద్యోగాలను కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. చంద్రబాబు స్ఫూర్తితో నగరి నియోజకవర్గంలోనూ పరిశ్రమలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ప్రకటించారు. తన తండ్రి, మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు హయాంలో విజయపురం మండలంలోని కోసలనగరం వద్ద ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు ఏపీఐఐసీ ద్వారా 1579 ఎకరాలను సేకరించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అంబత్తూరులో పరిశ్రమల విస్తరణకు స్థలాభావ సమస్య ఉన్న నేపథ్యంలో చెన్నైకు సమీపంలోని కోసలనగరంలో పరిశ్రమల ఏర్పాటుకు భూమి సిద్ధంగా ఉందన్నారు. మౌలిక సౌకర్యాల కల్పనకు తమ ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. కష్టించి పనిచేసే యువత నగరి నియోజకవర్గంలో ఉన్నారని వివరించారు. అనంతరం కోసలనగరం ఇండస్ట్రియల్ పార్కుపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా పారిశ్రామికవేత్తలు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను సన్మానించారు. అంబత్తూరు ఇండస్ట్రియల్ ఎస్టేట్ మాన్యుఫాక్చర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు ఏఎస్ హరిప్రసాద్‌తో పాటు అధ్యక్షుడు అరవింద్, సీనియర్ సభ్యుడు రమేష్ తదితరులతో ఎమ్మెల్యే చర్చించారు. ఈ సమావేశంలో మాధవనాయుడు, లక్ష్మీపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాద తయారీని ఆధునికీకరించండి

సిబ్బందికి శిక్షణ ఇవ్వడంతో పాటు ఇన్‌హౌస్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయండి

టీటీడీకి పాకశాస్త్ర నిపుణుల సూచన

తిరుమల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులకు మరింత రుచికరమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించడానికి అన్నప్రసాద తయారీ విధానాన్ని ఆధునికీకరించాలని ప్రఖ్యాత పాకశాస్త్ర నిపుణులు టీటీడీకి సూచించారు. తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనంలో మంగళవారం సాయంత్రం టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, దక్షిణ భారతదేశ చెఫ్స్ అసోసియేషన్ బృందంతో కలిసి అన్నప్రసాదం, వంటశాలల ఆధునికీకరణ తదితర అంశాలపై టీటీడీ ఈవో శ్యామలరావు సుదీర్ఘంగా చర్చించారు. అంతకు ముందు తిరుమలలోని వెంగమాంబ అన్నప్రసాద కేంద్రాన్ని సందర్శించిన చెఫ్స్ బృందం అన్నప్రసాదాలు వడ్డించడం, నిల్వ చేయడం, శుభ్రపరచడం తదితర కార్యకలాపాలను పరిశీలించింది.రోజురోజుకూ పెరుగుతున్న అసంఖ్యాక భక్తుల అవసరాలకు అనుగుణంగా వంటశాలను ఆధునికీకరించాలని సూచించింది.అన్నప్రసాద భవన సిబ్బందికి శిక్షణ ఇవ్వడం ద్వారా వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించడం, ఇన్‌హౌస్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసి తనిఖీ చేయడం, ఆహార పదార్థాల పరిశుభ్రత, వ్యర్థ పదార్థాల నిర్వహణ, పరికరాల యాంత్రీకరణ, ఆహారాన్ని రుచికరంగా, వేగవంతమైన పద్ధతిలో తయారు చేయడం, మూడు నెలలకోసారి ఫుడ్ అనలిస్టులతో సూచనలు తీసుకోవడం వంటి అనేక సూచనలు చేశారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లపై పక్కా ప్రణాళికను రూపొందించి మరోసారి అన్నప్రసాద కార్యకలాపాలపై ఆహారనిపుణులతో త్వరలో సమావేశం నిర్వహించనున్నట్టు ఈవో తెలిపారు. జీఆర్‌టీ గ్రూప్ ఆఫ్ హోటల్స్ సీఈవో విజయ్ విక్రమ్ కోటా, సౌతిండియా చెఫ్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ దామోదరన్, చెఫ్ తిరులోక్‌చందర్,తిరుపతిలోని ఇండియన్ కలినరీ ఇనిస్టిట్యూట్ హెడ్ చెఫ్ సీతారామ్ ప్రసాద్, కిచెన్ కన్సల్టెంట్స్, డిజైనర్ రితేష్ చౌదరీ, దీపక్, నితీష్, టీటీడీ డిప్యూటీఈవో రాజేంద్ర, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులో యువకుల వీరంగం

● నారాయణ విద్యాసంస్థల బస్సుపై మంగళంలో రాళ్లతో దాడి



ధ్వంసమైన బస్సు అద్దం - వీరంగం సృష్టించిన యువకులు

మంగళం, జూలై 9: గంజాయి మత్తులో ఇద్దరు యవకులు మంగళవారం సాయంత్రం నారాయణ విద్యాసంస్థకు చెందిన బస్సుపై మంగళంలో రాళ్లతో దాడి చేసి అద్దాలను పగులగొట్టారు. స్థానికులు, తిరుచానూరు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నారాయణ విద్యాసంస్థలకు చెందిన బస్సు 25 మంది విద్యార్థినులతో బయల్దేరింది. మంగళం బీటీఆర్ కాలనీ 16వ లైను వద్దకొచ్చేసరికి స్థానిక యువకులు బాలుప్రకాష్, మహేష్ అడ్డుగా నిలవడంతో డ్రైవర్ కుమార్ హారన్ కొట్టాడు. గంజాయి మత్తులో ఉన్న ఆ యువకులు అక్కడున్న రాళ్లను తీసుకుని బస్సు అద్దాలను పగులగొట్టారు. వాహనంలోని బాలికలు భయభ్రాంతులకు గురై కేకలు పెట్టారు. మరోవైపు డ్రైవర్ కుమార్‌ను కిందకు లాగి.. దుస్తులు చిరిగేలా కొట్టారు. అలాగే ఆ మార్గంలో వెళ్లే వాహనాలపైనా ఇలాగే దాడి చేస్తూ ఇబ్బందులు కల్గించారు. సమాచారం అందుకున్న మంగళం అవుట్ పోస్టు పోలీసులు అక్కడికి చేరుకుని, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. బస్సులో ఉన్న విద్యార్థినులను వారి తల్లిదండ్రులకు సమాచారం అందించి వెంటపంపించారు. వీరంగం సృష్టించిన యువకులను, దాడికి గురైన బస్సును తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు కిడ్నాపర్లు

శ్రీకాళహస్తి, జూలై 9: ఎన్ఆర్ఐను కిడ్నాప్ చేసిన కేసులో ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్ వద్ద తిరుపతికి చెందిన ఎన్ఆర్ఐ హరికృష్ణను కొందరు కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. సోమవారం రాత్రి ఆయన ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తిరుపతికి చెందిన ఇద్దరు కిడ్నాపర్లను మంగళవారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ఇందులో పాత్రధారులైన మరికొందరి కోసం గాలింపు కొనసాగిస్తున్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీతో ఆదాయం పెంపు



మాంస ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇస్తున్న డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్, జూలై 9: విలువ ఆధారిత మాంస ఉత్పత్తుల తయారీద్వారా ఆదాయాన్ని మరింతగా పెంచుకోవచ్చని ఎస్వీవెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య పేర్కొన్నారు. ఎస్వీవెటర్నరీ వర్సిటీలోని వెటర్నరీ కళాశాలలో పశు ఉత్పత్తుల సాంకేతిక శాస్త్రవిభాగం(ఎల్‌పీటీ) ఆధ్వర్యంలో ఐసీఏఆర్ ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులతో గ్రామీణ మహిళలకు విలువ చేకూరిత మాంస ఉత్పత్తుల తయారీలో నైపుణ్యాభివృద్ధిని పెంపొందించడంపై మంగళవారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన వర్సిటీ డీన్ డాక్టర్ కె.వీరబ్రహ్మయ్యతో జగపతిరామయ్య కలసి శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. ఉత్పత్తుల తయారీలో పాటించాల్సిన ప్రమాణాలు, మార్కెటింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. వీరికి విభాగ హెడ్ డాక్టర్ జి.విజయభాస్కర్ రెడ్డి నేతృత్వంలో శిక్షణ నిర్వహించారు. ఇందులో భాగంగా చికెన్ కట్‌లెట్స్, నగ్గెట్స్, సమోసాలు, చికెన్ ఇడ్లీలు, చికెన్ సూప్, మాంసపు సాజేసులు,ఖైమా ఉండలు, వడల తయారీ పద్ధతులపై మహిళలకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించారు. శిక్షణలో పాల్గొన్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అధ్యాపకులు డాక్టర్ సుధీర్, డాక్టర్ జడ్ నవీన్, స్వయంసహాయక సంఘాల మహిళా సభ్యులు హాజరయ్యారు.

ఏటీఎంలో కార్డు మార్చి రూ.40 వేల టోకరా

పాకాల, జూలై 9: స్థానిక ఆర్టీసీ బస్టాండు సమీపంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎంలో మంగళవారం సాయంత్రం డబ్బు డ్రా చేయడానికి వెళ్లిన వ్యక్తిని బురిడీ కొట్టించి ఏటీఎం కార్డు మార్చి రూ.40 వేలు కాజేశారు. బాధితుడి కథనం మేరకు ఇరంగారిపల్లె పంచాయతీ ముద్దలపల్లెకు చెందిన బి.కస్తూరి బాబు చీటీ కట్టాలని తిరుపతిలో వున్న కుమారుడిని రూ.ఏడు వేలు డబ్బులు అడిగాడు. ఇంట్లో వున్న ఏటీఎం కార్డు ద్వారా డ్రా చేసుకోవాలని కుమారుడు చెప్పాడు. భార్యతో కలిసి కస్తూరి బాబు ఆర్టీసీ బస్టాండు ఎదుట వున్న ఎస్‌బీఐ ఏటీఎంకు వెళ్లి డ్రా చేసుకోవడానికి ప్రయత్నించాడు. ఏటీఎం పనిచేయలేదు. ఇదంతా గమనిస్తున్న సుమారు 50 ఏళ్ల వయసున్న వ్యక్తి ఇదే కేంద్రంలో వున్న మరో మిషన్‌లో ట్రై చేస్తానని కార్డు తీసుకున్నాడు. ఈ మిషన్‌లోనూ డబ్బు రాలేదని మరో కార్డు వీరి చేతికిచ్చి ఒరిజినల్ నొక్కేశాడు. రేపు తీసుకుందామని ఇంటికెళ్లిన కాసేపటికే రూ.40 వేలు డ్రా అయినట్లు కుమారుడికి మెసేజ్ వెళ్లింది. దీంతో తండ్రిని ఏడు వేలు డ్రా చేసుకోమంటే రూ.40 వేలు తీసుకున్నావని కుమారుడు ప్రశ్నించాడు. అసలు నేను డబ్బులే డ్రా చేయలేదని చెప్పడంతో కార్డు చూసి మోసపోయామని గ్రహించారు. ఒరిజినల్ కార్డు స్థానంలో ఖాదం వెంకటరమణరావు పేరుతో కార్డు ఉండటంతో మోసపోయామని లబోదిబోమంటూ బాధితుడు పోలీస్ స్టేషన్‌కు పరుగులు తీశాడు.

శేషాచల అడవుల్లోకి

స్మగ్లర్ల చొరబాటు

అడ్డుకున్న పోలీసులు.. ఇద్దరి అరెస్టు

కారు, రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం



పట్టుబడిన స్మగ్లర్లతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చంద్రగిరి, జూలై 9: చంద్రగిరి మండలంలోని శ్రీనివాసమంగాపురం, శ్రీవారిమెట్టు సమీపంలో శేషాచలం అడవుల్లోకి చొరబడుతున్న కొందరు స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అడ్డుకుని, ఇద్దరిని అరెస్టు చేశారు. వారి నుంచి కారు, రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఇన్‌చార్జ్, తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు.. టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఎస్ఐ విష్ణువర్ధన్‌కుమార్ మంగళవారం కళ్యాణీడ్యామ్ నుంచి శ్రీవారిమెట్టు వైపు కూంబింగ్ చేపట్టారు. నాగపట్ల సెక్షన్ పరిధిలో ఒక కారు నుంచి కొంతమంది వ్యక్తులు దిగారు. వీరిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు చుట్టుముట్టే ప్రయత్నం చేయగా, పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి ఇద్దరిని పట్టుకున్నారు. వీరిని తమిళనాడు వేలూరు జిల్లా ఆనైకట్టుకు చెందిన శక్తివేల్, రాజేంద్రన్ చిన్నపయ్యన్‌లుగా గుర్తించారు. వారిని విచారించగా, తిరుపతి సమీపంలోని అడవుల్లో ఎర్రచందనం చెట్లను నరకడానికి అదే ప్రాంతానికి చెందిన రాజశేఖర్ అనే మేస్త్రీ తమను తీసుకువచ్చినట్లు తెలిపారు. వారి నుంచి కారు, రంపాలు, గొడ్డళ్లను స్వాధీనం చేసుకున్నారు. పారిపోయిన శెల్వరాజ్, రాజశేఖర్, గోపి, శీను, గోవిందన్‌ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అడవుల్లోని అన్ని ప్రాంతాల్లోనూ స్మగ్లర్ల కోసం జల్లెడ పట్టారు. అరెస్టయిన నిందితులను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకుని వచ్చి కేసు నమోదు చేయగా, సీఐ సురేష్ కుమార్ దర్యాప్తు చేస్తున్నారు. స్మగ్లర్లు అడవుల్లోకి వెళ్లి చెట్లను నరకకుండా సంరక్షించి, ముందస్తుగానే వీరిని పట్టుకోగలిగామని ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు.

భార్యను హత్య చేసిన భర్త అరెస్టు



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

మదనపల్లె అర్బన్, జూలై9: భార్యను గొంతు కోసి హత్య చేసిన ఆమె భర్త పి. గణపతి అలియాస్ వెంకటేష్‌ను అరెస్టు చేసినట్లు మదనపల్లె డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక రూరల్ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. గత నెల 27వ తేదీన నిమ్మనపల్లె మండలం, దీటు వారిపల్లె వద్ద రామాంజులు పొలంలో భారతి (26)ని ఆమె భర్త గణపతి అలియాస్ వెంకటేష్ రాత్రి కిరాతంగా చాకుతో గొంతుకోసి చంపేశాడన్నారు. 9 ఏళ్ల క్రితం చిత్తూరుజిల్లా, పలమనేరు పట్టణం, నాగరాళ్ళవీధికి చెందిన పి. గణపతి (37), చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, కొత్త కేశాపురానికి చెందిన వెంకటరమణ, సాలమ్మ దంపతుల కుమార్తె భారతిని వివాహం చేసుకున్నాడని వారికి ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు. వివాహం అయినప్పటి నుంచి భార్యపై అనుమానాలతో వివాదాలు జరుగుతుండగా భారతి భర్తపై అలిగి తన తల్లి సాలమ్మ వద్దకు వెళ్లిందన్నారు. ఈక్రమంలో భారతి ఆరు నెలల క్రితం నుంచి స్థానికంగా ఉన్న రవి అనే వ్యక్తితో పరిచయం ఏర్పడి సహజీవనం గడిపేదన్నారు. రవికి భార్య చనిపోగా పిల్లలు ఉన్నారన్నారు. ఈ విషయం తెలుసుకున్న గణపతి పలమనేరులో ఉన్న తమ పిల్లలను నీతో పంపిస్తానని చెప్పి నమ్మబలికి గత నెల 27న భార్య భారతిని వెంటతీసుకొచ్చి రామాంజులు పొలంలో చాకుతో గొంతు కోసి చంపేశాడన్నారు. పొలం యాజమాని రామాంజులు అల జడి తెలుసుకుని అక్కడికి రావడంతో గణపతి అతనిపై దాడి చేసి గాయపర్చాడన్నారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు తన పర్యవేక్షణలో మదనపల్లె రూరల్ సర్కిల్ సీఐ సద్గురుడు, నిమ్మనపల్లె ఎస్‌ఐ లోకేష్ రెడ్డి కేసును దర్యాప్తు చేసి నిందితుడు గణపతిని మదనపల్లె వద్ద మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

నేడు పీలేరులో ప్రత్యేక విద్యుత్ అదాలత్

పీలేరు, జూలై 9: పీలేరు-తిరుపతి మార్గంలోని టీటీడీ కళ్యాణ మండపానికి ఎదురుగా ఉన్న తన కార్యాలయంలో బుధవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ ఏర్పాటు చేసినట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ పీలేరు ఈఈ మునిచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక లోక్ అదాలత్ చైర్మన్‌గా విశ్రాంత జడ్జి వి.శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక సభ్యులుగా కె.రామమోహన్ రావు, సాంకేతిక సభ్యులుగా ఎస్ఎల్అంజనీ కుమార్, స్వతంత్ర సభ్యులుగా జి.ఈశ్వరమ్మ వ్యవహరిస్తారని ఆయన వెల్లడించారు. పీలేరు సబ్-డివిజన్, పీలేరు రూరల్, కలికిరి సబ్-డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు ప్రత్యేక లోక్ అదాలత్‌లో పాల్గొని వారి సమస్యలను పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. బుధవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు లోక్ అదాలత్ ఉంటుందని, ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని కోరారు.

విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీ

మదనపల్లె అర్బన్, జూలై 9: స్థానిక అవెన్యూ రోడ్డులోని ఉర్దూ స్కూల్‌లో మంగళవారం విద్యార్థులకు ఎమ్మెల్యే ఎం. షాజహాన్ బాషా విద్యాకిట్లు పంపిణీ చేశారు. అలాగే పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాని తిని రుచి చేశారు. అన్ని సక్రమంగా అందుతున్నాయా? అని ఆయన విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా విద్యను బోధించాలని సూచించారు. స్కూల్‌లో ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రాజగోపాల్, హెచ్‌ఎం షాజహాన్, హెల్పింగ్ హార్ట్స్ నిర్వాహకులు ఇస్మాయిల్, మంజు, సల్మాన్ తోపాటు నాయకులు నాదేళ్ల విద్యసాగర్, స్వామి, ఎస్ఏ మస్తాన్, జేసీబీ వేణు, బోర్‌వెల్ నాగరాజ, దమ్మిశెట్టి రామకృష్ణ ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, షేక్ షరీఫ్, బాబా, గిరీష్, తదితరులు పాల్గొన్నారు.

శాఖాహార సద్భావన యాత్ర



పీలేరులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు, జూలై 9: కలికిరి మండలం కొటాలలోని జేతవనం పిరమిడ్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం పీలేరు పట్టణంలో శాఖాహార సద్భావన యాత్ర నిర్వహించారు. మన రాష్ట్రంతో పాటు కర్ణాటక రాష్ట్రానికి చెందిన సుమారు 400 మంది పిరమిడ్ మాస్టర్లు ర్యాలీలో పాల్గొన్నారు. నాగరికత అభివృద్ధి అయిన తరువాత సాత్విక ఆహారమే మేలని మన దేశంలోని రుషులు తెలియజేశారని వారు ప్రజలకు వివరించారు. అనంతరం శాఖాహారం వల్ల కలిగే ప్రయోజనాలు, మాంసాహారం వల్ల కలిగే అనర్థాలను వివరించే ప్లకార్డులు చేతబూని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సొసైటీకి చెందిన మాస్టర్లు సుధాకర్, ప్రసాదరావు, గణేశ్, బాలాజీ, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి



:వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కలకడ, జూలై 9:గర్భిణులు తప్పని సరిగా ఆరోగ్య నియమాలను పాటించాలని వైద్యాధికారులు కిశోర్‌కుమార్‌రెడ్డి, జవహర్‌బాబులు సూచించారు. పీఎంఎస్‌ఎంఏ కార్యక్రమంలో భాగంగా జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలో సురక్షిత ప్రసవాలు జరుగుతాయన్నారు. అలాగే గర్భిణులు 108, 102 సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 42 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది జయరామయ్య, వెంకటేశ్వరరావు, రెడ్డెమ్మలు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్టు

మదనపల్లె అర్బన్, జూలై9: మదనపల్లె మండలం, నడిమి తాండాకు చెందిన బుక్కే లక్ష్మమ్మ సారా విక్రయిస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ రవికుమార్ తెలిపారు. సారా విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఉచిత ఇసుక పథకం.. పేదలకు వరం



సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



పీలేరులో సంబరాలు చేసుకుంటున్న భవన నిర్మాణ రంగ కార్మికులు

మదనపల్లె టౌన్, జూలై 9: రాష్ట్రంలో అధికారంలోకి వస్తూనే సీఎం చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక పథకం పేదలకు వరంలాంటిదని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బిల్డర్ అసోసి యేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు ఎమ్మెల్యే క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఇసుకను యథేచ్ఛంగా దోపిడీ చేయడమే కాకుండా సామాన్యులకు అందుబాటులో లేని ధరలతో విక్రయించారని దీని వలన భవన నిర్మాణ రంగం దెబ్బతినింద న్నారు. అనంతరం పట్టణంలోని అటవీశాఖకు చెందిన స్థలాన్ని కొందరు ఆక్రమించుకోవడంతో అక్కడికి వెళ్లిన ఎమ్మెల్యే అటవీశాఖ అధికారులు, సర్వేయర్‌తో కలసి చర్చించి రికార్డులు పరిశీలించాలని ఆదేశించారు. ఉర్దూ హైస్కూల్లో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఇంటి వద్ద పలు సమస్యలపై వచ్చిన ప్రజల నుంచి అర్జీలు తీసుకుని పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు విద్యాసాగర్, షంషీర్, శివన్న, రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పథకం.. ఒక విప్లవాత్మకమైన విధానం

కలికిరి, జూలై 9: ప్రజందరికీ ఉచితంగా ఇసుకను అందజేయాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు వెంటనే అమలు చేయడం విప్లవాత్మకమైన చర్యగా పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రశంసించారు. నిధుల కొరతతో ప్రభుత్వం కొట్టుమిట్టాడుతున్నా ఎలాంటి వెనుకడుగు వేయకుండా సాహసోపేతమైన నిర్ణయం తీసుకోవడం సీఎం చంద్రబాబుకే చెల్లిందని కితాబిచ్చారు. మంగళవారం నగరిపల్లెలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జేపీ వెంచర్స్‌ను అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు రూ.వేల కోట్లు విలువ జేసే ఇసుకను దోచుకున్నారని విమర్శించారు. చౌకగా ఇసుక అందుబాటులోకి రావడంతో భవన నిర్మాణ కార్మికులకు ఐదేళ్ళ తరువాత భారీ ఉపశమనం లభించిందన్నారు. కూటమి మ్యానిఫెస్టోకు అనుగుణంగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు పోతామని వివరించారు.

ప్రభుత్వ నిర్ణయంతో భవన నిర్మాణ కూలీల హర్షం

పీలేరు, జూలై 9: ఎన్నికలకు ముందు ఇచ్చిన విధంగా ఉచిత ఇసుక విధానం సీఎం చంద్రబాబునాయుడు తీసుకురావడం పట్ల భవన నిర్మాణ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. పీలేరులోని బహుజన బిల్డింగ్ వర్కర్స్ అసోసి యేషన్ నాయకులు ఏఎంసీ ప్రాంగణంలో మంగళవారం ఉచిత ఇసుక విధానం ప్రకటన పట్ల సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బలరాం మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం వల్ల గృహనిర్మాణాలు పెరిగి తద్వారా అటు పేదవాళ్ల స్వంతింటి కలనెర వేరడమే కాకుండా కార్మికులకు చేతినిండా పని దొరుకుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ అలీ బేగ్, రసూల్, ఎన్టీఆర్ నఫీస్, రమణయ్య, మహబూబ్ బాషా, షణ్ముగం, రామయ్య, వెంకటరమణ, కృష్ణ, మునిరత్నం, జయరామనాయుడు, సయ్యద్, లక్ష్మయ్య, ఎజాస్, పోతయ్య పాల్గొన్నారు.



ములకలచెరువులో మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు పాలగిరి సిద్ధా

ములకలచెరువులో: ఉచిత ఇసుక పాలసీతో రాష్ట్ర ప్రగతికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు బాటలు వేశారని టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా పేర్కొన్నారు. మండలంలోని కదిరినాథునికోటలో మంగళవారం జరిగిన టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇసుకను ఉచితంగా అందిస్తుండడంతో పేదల సొంత కళ నెరవేరి నిర్మాణ రంగం ఊపందుకుందన్నారు. అనంతరం ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో హామీ అయిన ఉచిత ఇసుక పాలసీ అమలు చేస్తుండడంతో చంద్రబాబు, పవన్‌కళ్యాన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పోతుల సాయినాథ్, టీడీపీ నేతలు నారాయణరెడ్డి, కేశవులు, కేవీ రమణ, భాస్కర్‌రెడ్డి, నాయకులు ఫాస్టర్ శీన, అనీల్‌కుమార్, లక్ష్మీపతి, నరసింహులు, నాగిరెడ్డి, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి పాలిటెక్నిక్ అడ్మిషన్లు

మదనపల్లె టౌన్, జూలై 9: రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ ఆధ్వ ర్యంలో ఈనెల 11వ తేదీ నుంచి పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు వెబ్ కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్లు ప్రారంభమవుతా యని జీఎంఆర్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఓబులేశు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ నుంచి 13వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా ఫీజులు చెల్లించాలన్నారు. దీంతో పాటు సర్టిఫికేట్స్ వెరి ఫికేషన్, 14వ తేది వరకు విద్యార్థులు వారి ఆప్షన్‌లు ఎంచు కోవచ్చన్నారు. అలాగే 18వ తేదీ నుంచి 20వ తేది లోపు అడ్మిష న్లు పొందిన విద్యార్థులు కళాశాలకు వచ్చి చేరాలని ప్రిన్సిపాల్ కోరారు.

వంతెన నిర్మాణానికి రికార్డులు పరిశీలన



భూముల కోల్పోతున్న రైతుల రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

మదనపల్లె అర్బన్, జూలై 9: స్థానిక టీకే పల్లె నుంచి బసినికొండ వరకు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి భూ నిర్వాసితుల రికార్డులను తహసీల్దార్ రమాదేవి ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఇందులో భూములను కోల్పోతున్న రైతుల నుంచి మంగళవారం పత్రాలను తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఇందులో బసినికొండలో 3 ఎకరాలు, వెంకప్పకోటల్లో 13 సెంట్లు, టీకేపల్లెలో 80 సెంట్లు, భూసేకరణకు ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ మేరకు ఆ ప్రాంతాల్లో భూములు కలిగిన రికార్డులను సేకరించారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్ ల్యాండ్ ఎక్విజేషన్ అధికారి గోపాలయ్య, వీర్వోలు పాల్గొన్నారు.

ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించండి



ఉపాధి సిబ్బందికి సూచనలిస్తున్న ఎంపీడీవో క్రిష్ణమూర్తి

తంబళ్లపల్లె, జూలై 9: ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కల్పించి సాగు చేపట్టే విధంగా ప్రోత్సహించాలని ఎంపీడీవో క్రిష్ణమూర్తి ఉపాధి సిబ్బందికి సూచించారు. మంగళవారం ఏపీవో అంజినప్పతో కలసి స్థానిక వెలుగు కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ..ఉపాధిలో పండ్లతోటలు, పూలతోటల సాగుకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అదేవిధంగా పాడిరైతులు పశుగ్రాసం పెంచుకోవడం, పొలం గట్లపై మొక్కల పెంపకం చేపట్టవచ్చన్నారు. ఏపీవో మాట్లాడుతూ..ఉపాధిలో పండ్లతోటలు చేపట్టే రైతులకు మూడు సంవత్సరాలకు తోట సంరక్షణకు మామిడి తోటకు ఎకరాకు 70 మొక్కలకు రూ.99,911లు, కొబ్బరిచెట్లు ఎకరాకు 65 మొక్కలకు రూ.88,300లు, అల్లనేరేడుకు ఎకరాకు 40 మొక్కలకు రూ.61 వేలు ఇస్తారన్నారు. రైతులకు పండ్లతోటలు, పూలతోటల పైన అవగాహన కల్పించి సాగు చేపట్టేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఇంజనీర్ రామన్న ఎంటీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువైద్యశాల భవనం



శిథిలావస్థకు చేరుకొన్న కదిరాయచెరువు పశువైద్యశాల భవనం

కలకడ, జూలై 9:మండలంలోని కదిరాయచెరువు పశువైద్యశాల భవనం శిథిలావస్థకు చేరుకొంది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవనం పైకప్పు దెబ్బతిని వర్షాలకు ఉరుస్తోంది. దీంతో రికార్డులు, దాణా, గడ్డి విత్తనాలు, మందులు భద్రపరచడం సిబ్బందికి కష్టతరమవుతోందని పశువైద్య సిబ్బంది వాపోతున్నారు. అంతేకాక విద్యుత్ సౌకర్యం లేదని దీంతో పాడి రైతులు అవస్థలు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని పాడి రైతులు కోరుతున్నారు.

తెలుగు యువత ఆదర్శంగా నిలవాలి



మంత్రి లోకేశ్‌ను కలసిన అరుణ్‌తేజ

మదనపల్లె టౌన్, జూలై 9: తెలుగు యువత అందరికి ఆదర్శంగా నిలవాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సూచించినట్లు మదనపల్లె నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నాదెళ్ల అరుణ్‌తేజ తెలిపారు. మంగళవారం మంగళగిరిలో మంత్రి నారా లోకేశ్‌ను అరుణ్‌తేజ మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో తెలుగు యువత పాత్ర తదితర విషయాలను మంత్రి నారా లోకేశ్‌కు వివరించినట్లు అరుణ్‌తేజ చెప్పారు.

మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన టీడీపీ నేత

ములకలచెరువు, జూలై 9: రాష్ట్ర మంత్రి, టీడీపీ యువ నేత నారా లోకేశ్‌ను తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ నేత దాసరిపల్లి జయచంద్రారెడ్డి కలిశారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నారా లోకేశ్‌ను కలిసి తంబళ్లపల్లె నియోజకవర్గ సమస్యలు, పార్టీ స్థితిగతులను వివరించారు. తంబళ్లపల్లె నియోజకవర్గ అభివృద్ధికి పూర్తిగా సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

మంత్రిని కలిసిన తెలుగు యువత నేతలు

కురబలకోట, జులై 9: తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన టీడీపీ తెలుగు యువత నేతలు విద్యా, ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్‌ను విజయవాడలో కలిశారు. నియోజకవర్గానికి చెందిన రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ఉపాధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డిలు కలిశారు. ఆయనకు పుష్పగుచ్చం అందజేసి, దుశ్శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తమ నియోజకవర్గంలో పర్యటించాలని కోరగా, త్వరలోనే పర్యటిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కాగా అంగళ్ళు, ములకలచెరువు ఘటనలో తమపై తప్పుడు కేసులు పెట్టిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. అలాగే ఈ ఘటనలో చంద్రబాబుపై దాడులకు పాల్పడిన వ్యక్తులను టీడీపీలో కొంతమంది ప్రోత్సహిస్తున్నారని అలాంటి వారిని అడ్డుకోవాలని కోరారు. అనంతరం నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలుపై వినతిపత్రం అందజేశారు.

విద్యార్థుల్లో సేవాభావం పెంపొందించండి

మదనపల్లె టౌన్, జూలై 9: విద్యార్థులు సామాజిక బాధ్యత తీసుకోవడంతో పాటు వారిలో సేవాభావం పెంపొందించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జడ్పీహైస్కూల్లో ఏబీవీపీ సంస్థాపన దినోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగంలో సమస్యలు పరిష్కరిస్తూ ఏబీవీపీ అందరికి ఆదర్శంగా నిలవాలన్నారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర పాఠశాలల కన్వీనర్ సాయిహితేష్, ఎంఈవో ప్రభాకర్‌రెడ్డి, హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఏబీవీపీ నాయకులు రాజు, పద్మనాభ, యశ్వంత్, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.

దుస్థితిలో సీతరగానిపల్లె రోడ్డు



రామసముద్రం, జూలై 9: రామసముద్రం పంచాయతీలోని సీతరగానిపల్లె రోడ్డు దుస్థితికి చేరుకుంది. రామసముద్రం నుంచి ముళబాగల్‌కు వెళ్లే మెయిన్ రోడ్డు నుంచి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఈ గ్రామం ఉంది. మండలంలోనే అతిపెద్దదైన అగ్రహారం చెరువు కట్టపై నుంచి ఈ గ్రామానికి వెళ్లాల్సి ఉంది. మట్టితో కూడిన ఈ రోడ్డు గత వర్షాలకు రోడ్డు చిత్తడిగా మారి, గుంతలు ఏర్పడి పాదచారులు సైతం వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. ఇక వాహనదారులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైతులు తమ పంట ఉత్పత్తులు మార్కెట్‌కు తరలించాలంటే ఈ రోడ్డు తప్ప వేరే దారి లేదు. అసలే సన్నని చెరువు కట్టపై గుంతల రోడ్డు వాహనాలు ఏమాత్రం అదుపు తప్పినా వాహనాలు చెరువులో పడిపోయే ప్రమాదం ఉందని రైతులు ఉందోళన చెందుతున్నారు. రోజు పాలను తీసుకెళ్లడానికి వచ్చే పాల వ్యాను డ్రైవర్ ఈ గ్రామానికి రావాలంటే ఇబ్బందిగా ఉందని ఇకపై ఈ రోడ్డులో రాలేనని చెబుతున్నాడని అతను రాకపోతే తమ పాలను ఏమి చేసుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు మారినా తమ గ్రామానికి వచ్చే రోడ్డు దుస్థితి మాత్రం మారడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి



రామసముద్రం పంచాయతీ సెక్రటరీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

రామసముద్రం, జూలై 9: ప్రజా సమస్యలపై స్పందించి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అధికారులకు సూచించారు. గత ప్రభుత్వంలో పెత్తందారి విధానం అమలు జరిగిందని కానీ ప్రస్తుత టీడీపీ ప్రభుత్వంలో ప్రజా పాలన జరుగుతుందని ఆయన అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం మండల స్థాయి ప్రభుత్వ అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, విద్యుత్, పంచాయతీరాజ్, రెవెన్యూ అధికారుల పని తీరుపై ఒకింత అసహనం వ్యక్తం చేస్తూ ప్రభుత్వ అధికారులు అందరూ బాధ్యతాయుతంగా పనిచే యాలన్నారు. ఈసందర్భంగా రామసముద్రం పంచాయతీలో ఎన్ని గ్రామాలు ఉన్నాయని సెక్రటరీ విద్యావతిని ఎమ్మెల్యే ప్రశ్నించగా ఆమె తడబడ్డారు. ఈ విషయంపై స్పందించిన ఎమ్మెల్యే మీరు ఇన్నిరోజులు ఏమి చేస్తున్నారని నిలదీశారు. వ్యవసాయ శాఖకు సంబంధించిన ఆర్‌బీకే సిబ్బంది రివ్యూలో పాల్గొనక పోవడంపై అసహనం వ్యక్తం చేస్తూ సమావేశానికి రాని సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఎంపీడీవో భానుప్రసాద్‌కు సూచించారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లను త్వరగా పంపిణీ చేయాలని ఏఈని ఆదేశించారు. మండలంలో పశు మేత భూములు అన్యాక్రాంతం అవుతున్నాయని పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. పంచా యతీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.

అతిసారపై ప్రజలు అప్రమత్తంగా ఉండండి



వైద్య సిబ్బందికి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

పెద్దతిప్పసముద్రం జూలై 9 : వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజలు అతిసార (డయేరియా) వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని పెద్దతిప్పసముద్రం మండల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పురుషోత్తంనాయక్, సూపర్‌వైజర్ విజయమ్మలు సూచించారు. మంగళవారం మండల కేంద్రమైన పీటీ ఎంలోని మండల పరిషత్ కార్యాలయంలో అతిసార సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. జ్వరాలు, జలుబు, దగ్గు విరేచనాలపై వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే చేసి ఆయా గ్రామాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ కలుషితమైన ఆహారం, నీరు తీసుకోవడం వలన డయేరియా వ్యాప్తి చెందే ప్రమాదం ఉందన్నారు. తరచూ చేతులను సబ్బుతో శుభ్రపరచుకోవాలన్నారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరునిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి ఒక్కరు దోమతెరలను వాడాలని సూచించారు. అతిసార బారిన పడకుండా ఓఆర్ఎస్ ద్రావణం. జింక్ మాత్రలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బి.కొత్తకోట, పీటీఎం మండలలాకు చెందిన ఆశా వర్కర్లు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఒకటిన్నర సంవత్సరం నుంచి లెక్కల మాస్టర్ డుమ్మా

పెద్దమండ్యం, జూలై 9: పాఠశాలకు డుమ్మా కొట్టే విద్యార్థులను చూశాం. కానీ నెల కాదు రెండు నెలలు కాదు ఏకంగా ఒకటిన్నర సంవత్సరం నుంచి స్కూల్ విధులకు డుమ్మా కొట్టిన లెక్కల మాస్టర్ కథ పెద్దమండ్యం మండలంలో వెలుగు చూసింది. పెద్దమండ్యంలోని మోడల్ స్కూల్, కాలేజీలో 10వ తరగతి, ఇంటర్మీడియట్ తరగతుల ఓ లెక్కల మాస్టర్ ఒకటిన్నర సంవత్సరం కాలంగా అనధికారికంగా విధులకు హాజరుకాకుండా డుమ్మా కొడుతున్నాడని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. దీంతో విద్యార్థులు రెండేళ్లగా లెక్కల సబ్జెక్టు లెక్చరర్ లేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఈ మోడల్ స్కూల్ లోనే రెండేళ్లగా హిందీ టీచర్ కూడా లేక పోవడంతో హిందీ పాఠ్యాంశాలు సకాలంలో పూర్తి కాక పలు ఇక్కట్లు పడుతున్నట్లు విద్యార్థులు వాపోతున్నారు. ఈ విషయమై మోడల్ స్కూల్, కాలేజీ ప్రిన్సిపాల్ రామాంజులునాయక్‌ను వివరణ కోరగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ సంబంధించిన లెక్చరర్ మాస్టర్ 6 నెలలు సెలవు పెట్టారు. అనంతరం ఒకటిన్నర సంవత్సరం నుంచి అనధికారింగా విధులకు హాజరుకాలేదన్నారు. ఈ వ్యవహారంను జిల్లా విద్యాధికారికి ఫిర్యాదు చేశామని వెల్లడించారు. అలాగే రెండేళ్లుగా హిందీ టీచర్ పోస్టు ఖాళీగా ఉందన్నారు ఇకనైన జిల్లా విద్యాధికారులు చర్యలు తీసుకొని కాలేజీల్లో ఖాళీగా ఉన్న టీచర్, లెక్చరర్ పోస్టులు భర్తీ చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

విద్యాశాఖ ఆర్‌జేడీని కలసిన విజయభారతి సేతు



విద్యాశాఖ ఆర్‌జేడీ శామ్యూల్‌ను మర్యాదపూర్వకంగా కలసిన సేతు

మదనపల్లె టౌన్, జూలై 9: విద్యాశాఖ కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్‌జేడీ)గా నియమితులైన శామ్యూల్‌ను మదనపల్లె విజయభారతి హైస్కూల్ కరస్పాండెంట్ ఎన్.సేతు మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం కడపలో బాధ్యతలు చేపట్టిన శామ్యూల్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చిన సేతు అభినందనలు తెలిపారు. మదనపల్లె డీవైఈవోగా, చిత్తూరు, అనంతపురం, నెల్లూరు జిల్లాల డీఈవోగా పనిచేసిన శామ్యూల్ పదోన్నతిపై ఆర్‌జేడీగా బాధ్యతలు చేపట్టడంతో సేతు ఆయనను కలిశారు. అమ్మఒడి పథకం ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులకు కూడా వర్తింపజేయాలని కోరారు. ఆయనతో పాటు మదనపల్లె డివిజన్‌లోని పలువురు ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ చైతన్య సమితి అధికార ప్రతినిధిగా సహజీవన్‌బాబు



మదనపల్లె, జూలై 9: జాతీయ బీసీ చైతన్య సమితి ఏపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా మాజీకౌన్సిలర్ జి.సహజీవన్‌బాబును నియమిస్తూ ఆసంఘం జాతీయ అధ్యక్షుడు బీసీ రమణ ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక నిమ్మనపల్లె సర్కిల్‌లోని మాజీసైనికుల సంక్షేమ సంఘ కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే మదనపల్లె నియోజకవర్గం అధ్యక్షునిగా కూడా ఉంటారని ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీసీ రమణ మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో బీసీలను చైతన్య పరిచేందుకు సహజీవన్‌బాబుకు ఈరెండు బాధ్యతలు అప్పటిగిస్తున్నట్లు పేర్కొన్నారు. బీసీ సంక్షేమం, అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, తనకు ఈ బాధ్యతను కట్టబెట్టిన జాతీయ అధ్యక్షునికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో మాజీసైనికుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసులునాయుడు, టీడీపీ పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్, మాజీకౌన్సిలర్ రాజశ్యామ్, ఉమేష్‌నాయుడు, బాజ్జి, వాల్మీకి లక్ష్మీనారాయణ, మేదరసంఘం వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కాలువ పూడికతీత పనులు చేపట్టండి

మదనపల్లె, జూలై 9: మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ నేరేళ్లచెరువు, పెద్దచెరువు పూడిక తీత పనులు చేపట్లాని రామాచార్లపల్లెకు చెందిన రైతులు ఇరిగేషన్ అధికారులను కోరారు. పట్టణం గుండా ప్రవహించే బాహుదానది నుంచి పచ్చర్ల చెరువుకు ఆయకట్టుకాలువ ఉందన్నారు. ప్రస్తుతం కాలువ మట్టితో పూడిపోయి, కంపచెట్లతో పూర్తిగా నిండిపోయిందన్నారు. వర్షాకాలం కావడంతో బాహుదానది ప్రవహించే అవకాశం ఉందని, ఆలోగా ఆయకట్టుకాలువ పనులు చేపట్టాలని రైతులు డీఈ, ఈఈలను కోరారు. బాహుదానీరు ప్రవాహంతో చెరువు నిండటంతోపాటు పంచాయతీలోని తాగునీటి బోర్లు వృద్ధిలోకి వస్తాయమని వివరిస్తూ రైతులు వినతి పత్రం అందజేశారు. స్థానిక టీడీపీ నేత గంగారపు బాబురెడ్డి ఆధ్వర్యంలో రైతులు నటశేఖర్, బాలప్పగారి రామస్వామి, పుల్లయ్య, వెంకటరమణ, జి.వెంకటరమణ, తదితరులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

మూడు విద్యుత్ కేంద్రాల కోసం ప్రతిపాదనలు

నిమ్మనపల్లి, జూలై 9: మండలంలో విద్యుత్ సరఫరాను నాణ్యతగా వినియోగదారులకు అందించడానికి నిమ్మనపల్లికు మూడు విద్యుత్ కేంద్రాలు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు ట్రాన్స్‌ఏఈ వసంత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో అగ్రికల్చర్ విద్యుత్ కనెక్షన్‌లకు సంబంధించి 5600 ఉండగా, ఇళ్ల కనెక్షన్‌లు 8300 ఉన్నాయని అదే విధంగా గ్రామాలలో నీటి బోర్ల ఏర్పాటుకు 600కనెక్షన్‌లు ఉన్నాయన్నారు. వాటి అన్నింటికీ ప్రస్తుతం విద్యుత్ సరఫరా చేయాలంటే ఎక్కువగా ట్రాన్స్‌పార్మర్లు కాలిపోతున్నట్లు తెలిపారు. చల్లావారిపల్లి, తవళం, అగ్రహారం పంచాయతీలలో మూడు విద్యుత్ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు పంపనున్నట్లు తెలిపారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు తెలిపామన్నారు.

19న పీలేరు ఆలయాల్లో వేలం పాటలు

పీలేరు, జూలై 9: పీలేరు పట్టణంలోని రౌద్రాల అంకాళమ్మ, మదనపల్లె మార్గంలోని చెన్నకేశవ స్వామి దేవస్థానంలో ఈనెల 19వ తేదీన వేలం పాటలు నిర్వహించనున్నట్లు ఈవో రవీంద్రరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రౌద్రాల అంకాళమ్మ ఆలయంలో చీరలు, రవికలు, కొబ్బరి చిప్పల సేకరణ, ఖాళీ స్థలానికి సంబంధించిన వేలం, చెన్నకేశవ స్వామి దేవస్థానానికి పీలేరు మండలం దొడ్డిపల్లె, బోడుమల్లువారిపల్లె, వేపులబైలు, పీలేరు, అగ్రహారం పంచాయతీలు, గుర్రంకొండ మండలంలోని తరిగొండ గ్రామంలో ఉన్న భూములను లీజుకు ఇచ్చేందుకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆయన వివరించారు. మరిన్ని వివరాలకు తనను 9398662648 నెంబరులో సంప్రదించాలని ఈవో తెలిపారు.